పత్రికతో.. మార్పులు

APTEL/25/A1880

TN తెలుగు న్యూస్

దిన పత్రిక

మా కలం మీ గళం.. సామాన్యుని గుండె చప్పుడు..

సంపుటి : 1 సంచిక : 715 పబ్లిషర్స్ & చీఫ్ ఎడిటర్ : యన్. కృష్ణారావు ఎడిటర్ : ఎస్. మస్తాన్ శనివారం 12.09.2026 పేజీలు : 8 వెల : 4/-




ఆల్ టైమ్ రికార్డ్

## ఒకే రోజులో 20 లక్షల IRCTC టికెట్లు!

- ఒక్కరోజే 20 లక్షలకు పైగా రైలు టికెట్ల బుకింగ్
- సామర్థ్యాన్ని రెట్టింపు చేసిన కొత్త సర్వర్లు, వెబ్‌సైట్
- బాట్‌లు, మోసపూరిత బుకింగ్‌లపై ఉక్కుపాదం
- 3 కోట్లకు పైగా ఫేక్ యూజర్ ఐడీల డియాక్టివేషన్

పండుగల సీజన్ సమీపిస్తుండటంతో రైలు టికెట్లకు డిమాండ్ భారీగా పెరిగింది. ఈ నేపథ్యంలో ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) తన చరిత్రలోనే సరికొత్త రికార్డు సృష్టించింది. ఈ నెల 7వ తేదీన ఒక్కరోజే 20 లక్షలకు పైగా టికెట్లను బుక్ చేసి ఆల్ టైమ్ రికార్డు నెలకొల్పింది. ఐఆర్‌సీటీసీ చరిత్రలో రోజువారీ బుకింగ్‌ల సంఖ్య 20

తరువాయి 2లో

ఎన్జీటీ నోటీసులు

## మూసీ ప్రాజెక్టుకు ఎదురుదెబ్బ



- మూసీ ప్రాజెక్టుపై ఎన్జీటీలో కొత్త పిటిషన్
- తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ
- పర్యావరణ అనుమతులపై రిటైర్డ్ ఇంజినీర్ల అభ్యంతరాలు
- 55 కి.మీ.లో 20 కి.మీ. అధ్యయనంపై ప్రశ్నలు
- ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ నిర్మాణాలపై అభ్యంతరం

2లో



దేశంలో రెట్టింపైన

## విద్యుత్ డిమాండ్

- మే 21న 270.8 గిగావాట్లకు చేరిన గరిష్ఠ డిమాండ్
- జులై 2026 నాటికి 552 గిగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం
- 5.10 లక్షల సర్క్యూట్ కిలోమీటర్లకు పెరిగిన ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్
- పునరుత్పాదక విద్యుత్ సామర్థ్యంలో భారత్ మూడో స్థానం

2లో

శాంతిభద్రతలే లక్ష్యం

# 'త్రిశూల్' ఆపరేషన్‌కు సీఎం ఆదేశం

### డ్రగ్స్, మహిళలపై వేధింపులు, రోడ్డు ప్రమాదాల నిర్మూలనే లక్ష్యం




- సోషల్ మీడియాలో అసభ్య పోస్టులపై కఠిన చర్యలకు దిశానిర్దేశం
- రాష్ట్రంలో నేరాల రేటు 14 శాతం తగ్గిందన్న ముఖ్యమంత్రి
- రోడ్డు ప్రమాదాల్లో ఏపీ దేశంలోనే మొదటి స్థానంలో ఉందని ఆవేదన

రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక ఆదేశాలు జారీ చేశారు. 8వ జిల్లా కలెక్టర్ల సదస్సులో భాగంగా ఎస్పీలు, కలెక్టర్లతో నిర్వహించిన

తరువాయి 2లో

ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు

## సముద్ర భద్రత కీలకం: ప్రధాని మోదీ




- ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సముద్రయాన స్వేచ్ఛ, నావికుల భద్రత అత్యంత ముఖ్యం
- సముద్ర వాణిజ్యానికి పెరుగుతున్న అంతరాయాలపై ప్రధాని మోదీ ఆందోళన
- ప్రపంచ జీడీపీలో బ్రిక్స్ దేశాల వాటా 40 శాతానికి పెరిగిందన్న ప్రధాని
- బ్రిక్స్ దేశాల మధ్య పెట్టుబడులు, భాగస్వామ్యం పెరగాలని పిలుపు

2లో



ఏఐతో ఐసిస్ వల

## టార్గెట్ భారత యువత

- ప్రచారం కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) విస్తృత వినియోగం
- భారత్‌లో మహిళలు, చిన్నారులే లక్ష్యంగా ఐసిస్, అల్-ఖైదా కార్యకలాపాలు
- లింగ భేదం, వయసు ఆధారంగా ప్రత్యేక కంటెంట్ రూపకల్పన
- దక్షిణ భారతదేశంలో ఈ తరహా కార్యకలాపాలు అధికంగా ఉన్నాయని నిఘా వర్గాల వెల్లడి

ఐసిస్, అల్‌ఖైదా వంటి భయానక ఉగ్రవాద సంస్థలు తమ పంథాను పూర్తిగా మార్చుకున్నాయి. భౌతిక దాడుల స్థానంలో భావజాల వ్యాప్తి, రాడికలైజేషన్‌ను ప్రధాన అస్త్రంగా

తరువాయి 2లో

టోల్ ప్లాజాలకు

## గుడ్‌బై.. కొత్త రూల్

- ఫిబ్రవరికి బారియర్ ఫ్రీ టోల్ విధానం
- ఫాస్టాగ్‌కు నంబర్‌ప్లేట్ గుర్తింపు జత
- టోల్ ఆదాయం ఏటా రూ.10 వేల కోట్లు పెరిగే అవకాశం ఉందన్న గడ్కరీ
- ఫాస్టాగ్‌తో నిరీక్షణ 80-90 శాతం తగ్గిందని వెల్లడి
- టోల్ ప్లాజాల వద్ద వాహనాలు ఆగాల్సిన అవసరం ఉండదని స్పష్టీకరణ

2లో



ఎడారిలో కొత్త నగరం

## 6,000 ఇళ్లతో 'మాన్యుమెంట్ హిల్స్'

- లాస్ వెగాస్‌లో 940 ఎకరాల ఫెడరల్ భూమిని కొనుగోలు చేసిన డెవలపర్లు
- 'మాన్యుమెంట్ హిల్స్' పేరుతో 6,000 ఇళ్లతో భారీ టౌన్‌షిప్ నిర్మాణం
- రెండు దశాబ్దాల్లో బ్యూరో ఆఫ్ ల్యాండ్ మేనేజ్‌మెంట్ జరిపిన అతిపెద్ద భూ విక్రయం ఇది
- సైనిక కుటుంబాలకు ప్రత్యేక గృహాలు, పాఠశాలలు, పార్కుల ఏర్పాటు



- భూమి అమ్మకం ద్వారా వచ్చిన నిధులను విద్య, పర్యావరణ ప్రాజెక్టులకు కేటాయింపు

లాస్ వెగాస్‌లో భారీ రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. నగరంలో పెరుగుతున్న గృహ అవసరాలను తీర్చే లక్ష్యంతో 'మాన్యుమెంట్ హిల్స్' పేరుతో ఒక భారీ మాస్టర్‌ప్లాన్డ్ కమ్యూనిటీని నిర్మించేందుకు డెవలపర్లు

తరువాయి 2లో

# శాంతిభద్రతలే లక్ష్యం 'త్రిశూల్' ఆపరేషన్‌కు సీఎం ఆదేశం

రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక ఆదేశాలు జారీ చేశారు. 8వ జిల్లా కలెక్టర్ల సదస్సులో భాగంగా ఎస్పీలు, కలెక్టర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో 'త్రిశూల్' పేరుతో ప్రత్యేక కార్యాచరణకు ఆయన శ్రీకారం చుట్టారు. 'జీరో డ్రగ్స్, మహిళలపై వేధింపుల పట్ల జీరో టాలరెన్స్, జీరో రోడ్డు ప్రమాదాలు' లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. 'త్రిశూల్' పేరుతో రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేసి, స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ఆదేశించారు. సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు, వ్యవస్థీకృతంగా సాగుతున్న వేధింపులపై ఉక్కుపాదం మోపాలని స్పష్టం చేశారు. ఈ అంశాలపై మంత్రుల కమిటీ లోతైన అధ్యయనం చేస్తుందని ఆయన తెలిపారు. సైబర్ నేరాల నియంత్రణ కోసం ప్రతి జిల్లాకు సాంకేతిక పరిజ్ఞానం కలిగిన 30 మంది కానిస్టేబుళ్లను కేటాయించినట్లు వెల్లడించారు. గంజాయి సహా మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రత్యేక క్యాలెండర్ రూపొందించి విస్తృత ప్రచారం కల్పించాలని, విశాఖపట్నం, తిరుపతి, అమరావతి నగరాల్లో డీఅడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. దేశవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల్లో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉండటంపై ఆవేదన వ్యక్తం చేసిన సీఎం, ప్రతి ప్రమాదాన్ని క్షుణ్ణంగా ఆడిట్ చేసి, అందుకు గల కారణాలను విశ్లేషించాలని అధికారులను ఆదేశించారు. గత రెండేళ్లలో రాష్ట్రంలో నేరాలు 14 శాతం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు 29.2 శాతం తగ్గాయని చంద్రబాబు వివరించారు. ప్రస్తుతం శిక్షల ఖరారు రేటు (కన్విక్షన్ రేటు) 47 శాతంగా ఉందని, దీనిని మరింత పెంచాలని సూచించారు. నేరం జరిగిన 30 నిమిషాల్లోపే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకోవాలని, కేసుల సత్వర పరిష్కారానికి 'వన్ కోర్టువన్ కానిస్టేబుల్' విధానాన్ని పరిశీలించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## దేశంలో రెట్టింపైన విద్యుత్ డిమాండ్

దేశంలో విద్యుత్ అవసరాలు భారీగా పెరుగుతున్నాయి. పదేళ్లలో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ దాదాపు రెట్టింపైంది. 201314లో 135.9 గిగావాట్లుగా ఉన్న పీక్ డిమాండ్ 2026 మే 21న రికార్డు స్థాయిలో 270.8 గిగావాట్లకు చేరింది. ఇళ్లలో విద్యుత్ వినియోగం పెరగడం, పరిశ్రమలు విస్తరించడం, వ్యాపార కార్యకలాపాలు ఊపందుకోవడం దీనికి ప్రధాన కారణాలని కేంద్రం శుక్రవారం తెలిపింది. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని కూడా దేశం భారీగా పెంచింది. 2014 మార్చిలో 249 గిగావాట్లుగా ఉన్న మొత్తం విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 2026 జులై నాటికి 552 గిగావాట్లకు చేరింది. దీంతో ప్రస్తుత అవసరాలను తీర్చడంతో పాటు భవిష్యత్తులో పెరగనున్న డిమాండ్‌ను ఎదుర్కొనే సామర్థ్యం పెరిగింది. విద్యుత్ సరఫరా వ్యవస్థ కూడా గణనీయంగా విస్తరించింది. 2014 ఏప్రిల్‌లో 2,91,336 సర్క్యూట్ కిలోమీటర్లుగా ఉన్న ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్ 2026 జులై నాటికి 5,10,594 సర్క్యూట్ కిలోమీటర్లకు చేరింది. దీంతో దేశవ్యాప్తంగా విద్యుత్‌ను ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి సరఫరా చేయడం మరింత సులభమైంది. ఇదే సమయంలో పునరుత్పాదక ఇంధన రంగంలోనూ భారత్ వేగంగా ముందుకెళ్తోంది. ఐఆర్ఈఎన్ఏ విడుదల చేసిన 'రిన్యూవబుల్ ఎనర్జీ స్టాటిస్టిక్స్ 2026' ప్రకారం పునరుత్పాదక విద్యుత్ సామర్థ్యంలో భారత్ ప్రపంచంలో మూడో స్థానంలో ఉంది. 2026 మార్చి 31 నాటికి దేశంలో మొత్తం శిలాజేతర విద్యుత్ సామర్థ్యం 283.46 గిగావాట్లుగా ఉంది. ఇందులో 274.68 గిగావాట్లు పునరుత్పాదక ఇంధనం, 8.78 గిగావాట్లు అణు విద్యుత్ సామర్థ్యం. 202526లో రికార్డు స్థాయిలో 55.3 గిగావాట్ల శిలాజేతర సామర్థ్యం అదనంగా చేరింది. 2025 జూన్‌లో భారత్ కీలక మైలురాయిని అందుకుంది. దేశంలో మొత్తం స్థాపిత విద్యుత్ సామర్థ్యంలో శిలాజేతర ఇంధనాల వాటా 50 శాతానికి చేరింది. దీంతో 2030 నాటికి చేరుకోవాల్సిన పారిస్ ఒప్పంద లక్ష్యాన్ని భారత్ ఐదేళ్లు ముందుగానే సాధించింది.

## ఆల్ టైమ్ రికార్డ్ ఒకే రోజులో 20 లక్షల IRCTC టికెట్లు!

పండుగల సీజన్ సమీపిస్తుండటంతో రైలు టికెట్లకు డిమాండ్ భారీగా పెరిగింది. ఈ నేపథ్యంలో ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) తన చరిత్రలోనే సరికొత్త రికార్డు సృష్టించింది. ఈ నెల 7వ తేదీన ఒక్కరోజే 20 లక్షలకు పైగా టికెట్లను బుక్ చేసి ఆల్ టైమ్ రికార్డు నెలకొల్పింది. ఐఆర్‌సీటీసీ చరిత్రలో రోజువారీ బుకింగ్‌ల సంఖ్య 20 లక్షల మార్కును దాటడం ఇదే మొదటిసారి కావడం విశేషం. ఐఆర్‌సీటీసీ వెల్లడించిన వివరాల ప్రకారం.. సెప్టెంబర్ 7న ఒకేరోజులో మొత్తం 20,06,353 టికెట్లు బుక్ అయ్యాయి. ఆ మరుసటి రోజు, సెప్టెంబర్ 8న కూడా రద్దీ కొనసాగి, 19,50,699 టికెట్లు బుక్ అయ్యాయి. గతేడాది పండుగ సీజన్‌లో నమోదైన అత్యధిక సింగిల్‌డే బుకింగ్ (18,40,203) కంటే ఇది 6 శాతం అధికం. ప్రస్తుతం రైల్వే రిజర్వ్‌డ్ టికెట్లలో దాదాపు 89 శాతం ఆన్‌లైన్‌లోనే బుక్ అవుతున్నాయని, ఈ భారీ ట్రాఫిక్‌ను తట్టుకునేలా సాంకేతిక వ్యవస్థను బలోపేతం చేశామని ఐఆర్‌సీటీసీ తెలిపింది. భారీగా పెరిగిన ఈ ట్రాఫిక్‌ను సమర్థంగా నిర్వహించేందుకు ఐఆర్‌సీటీసీ ఇటీవల కీలక మార్పులు చేసింది. ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ వ్యవస్థ సామర్థ్యాన్ని దాదాపు రెట్టింపు చేస్తూ కొత్త సర్వర్లను ఏర్పాటు చేసింది. అంతేగాక 2026 జులై 15న సరికొత్త వెబ్‌సైట్, యూజర్ ఇంటర్‌ఫేస్‌ను ప్రారంభించింది. ఈ కొత్త వెబ్‌సైట్‌లో ప్రయాణికులు వివిధ తరగతుల్లో సీట్ల లభ్యతను ఒకే స్క్రీన్‌పై చూసుకునే వెసులుబాటు కల్పించారు. సాంకేతిక అప్‌గ్రేడ్‌లతో పాటు మోసపూరిత బుకింగ్‌లు, బాట్‌ల వాడకంపై ఐఆర్‌సీటీసీ ఉక్కుపాదం మోపింది. ఇందుకోసం ప్రవేశపెట్టిన యాంటీబాట్ సిస్టమ్ ద్వారా అనుమానాస్పద బాట్ ట్రాఫిక్‌ను 5565 శాతం తగ్గించగలిగినట్లు సంస్థ వెల్లడించింది. అలాగే, బుకింగ్ విండో తెరుచుకున్న మొదటి 10 నిమిషాల పాటు (ఉదయం 8 నుంచి 8:10 వరకు) అధీకృత ఏజెంట్లు టికెట్లు బుక్ చేయకుండా నిబంధన విధించింది. రిజర్వేషన్ విండో ఓపెన్ అయినప్పుడు టికెట్లు బుక్ చేసే యూజర్లకు ఆధార్ వెరిఫికేషన్‌ను కూడా తప్పనిసరి చేసింది. ఈ చర్యల్లో భాగంగా మోసపూరిత కార్యకలాపాలకు పాల్పడుతున్న 3.04 కోట్ల యూజర్ ఐడీలను డియాక్టివేట్ చేసినట్లు, మరో 6.33 కోట్ల ఐడీలను రీవెరిఫికేషన్ కోసం ఫ్లాగ్ చేసినట్లు ఐఆర్‌సీటీసీ స్పష్టం చేసింది. ఇంత భారీ స్థాయిలో రికార్డు బుకింగ్‌లు జరిగినప్పటికీ, కొత్త ఆన్‌లైన్ వ్యవస్థలో ఎటువంటి పెద్ద అంతరాయాలు కలగలేదని పేర్కొంది.

## ఎన్జీటీ నోటీసులు మూసీ ప్రాజెక్టుకు ఎదురుదెబ్బ

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు మరోసారి న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యాయి. ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన పర్యావరణ అనుమతులను సవాల్ చేస్తూ రిటైర్డ్ ఇంజినీర్లు చెన్నైలోని 'నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్' (ఎన్జీటీ) దక్షిణాది బెంచ్‌ను ఆశ్రయించారు. ఈ అప్పీల్‌పై విచారణ చేపట్టిన ట్రిబ్యునల్ తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. మూసీ ప్రక్షాళన పనులకు సంబంధించి పర్యావరణ నిబంధనలు, అనుమతుల్లో లోపాలు ఉన్నాయని పిటిషనర్లు ఆరోపించారు. మూసీ పరివాహక ప్రాంతం మొత్తం 55 కిలోమీటర్లు ఉంటే.. కేవలం 20 కిలోమీటర్ల మేర మాత్రమే అధ్యయనం చేశారని పేర్కొన్నారు. ఇదే ప్రాంతంలో మృగవాణి జాతీయ పార్కు కూడా ఉందని తెలిపారు. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ పరిసరాల్లో భారీ నిర్మాణాలు చేపట్టాలన్న ప్రభుత్వ నిర్ణయంపైనా రిటైర్డ్ ఇంజినీర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. వాణిజ్య సముదాయాల ఏర్పాటుపైనా అభ్యంతరాలు లేవనెత్తారు. ప్రాజెక్టు వల్ల పర్యావరణంపై పడే ప్రభావాన్ని సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని పిటిషనర్లు వాదించారు. పిటిషన్‌ను పరిశీలించిన ఎన్జీటీ.. ప్రతివాదిగా ఉన్న తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చింది. పర్యావరణ అనుమతుల జారీ, ప్రాజెక్టు అమలుకు సంబంధించిన వివరాలను ట్రిబ్యునల్‌కు సమర్పించాలని ఆదేశించింది. ఈ అంశంపై ప్రభుత్వం తన వాదనను కూడా వెల్లడించాల్సి ఉంది. మూసీ ప్రాజెక్టుపై గతంలోనూ ఎన్జీటీలో న్యాయపరమైన వివాదం కొనసాగింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను ఎన్జీటీ కొట్టివేసింది. ఇప్పుడు మరో పిటిషన్ దాఖలు కావడంతో ఈ వ్యవహారం మళ్లీ చర్చనీయాంశంగా మారింది. రిటైర్డ్ ఇంజినీర్లు దాఖలు చేసిన అప్పీల్‌పై తదుపరి విచారణను ఎన్జీటీ అక్టోబర్ 16కు వాయిదా వేసింది. ఆ విచారణలో పిటిషనర్లు లేవనెత్తిన పర్యావరణ అభ్యంతరాలు, రాష్ట్ర ప్రభుత్వం సమర్పించే వివరణలు కీలకం కానున్నాయి. ఇప్పటికే మూసీ ప్రక్షాళనను ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో ఎన్జీటీలో తాజా పరిణామం రాజకీయంగానూ ప్రాధాన్యం సంతరించుకుంది.



## టోల్ ప్లాజాలకు గుడ్‌బై.. కొత్త రూల్

హైవేలపై టోల్ చెల్లింపుల్లో కీలక మార్పు రానుంది. ఇక వాహనాలు టోల్ ప్లాజాల వద్ద ఆగాల్సిన అవసరం లేకుండా పూర్తిగా డిజిటల్ విధానాన్ని తీసుకురానున్నారు. వచ్చే ఫిబ్రవరిలోగా ఈ విధానం అందుబాటులోకి రానుందని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ముంబైలో జరుగుతున్న 'గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2026'లో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న ఫాస్టాగ్‌కు వాహన నంబర్‌ప్లేట్ గుర్తింపు సాంకేతికతను జోడించనున్నట్లు చెప్పారు. ఫాస్టాగ్, నంబర్‌ప్లేట్ రెండింటి సాయంతో వాహనాలను గుర్తించి టోల్ వసూలు చేస్తారు. కొత్త విధానం వల్ల టోల్ వసూళ్లు ఏటా రూ.10 వేల కోట్లు పెరిగే అవకాశం ఉందని గడ్కరీ చెప్పారు. టోల్ చెల్లించేందుకు వాహనాలు ఆగకపోవడంతో ప్రయాణ సమయం కూడా తగ్గుతుందని తెలిపారు. ఫాస్టాగ్ రాకతో టోల్ ప్లాజాల వద్ద వేచి చూసే సమయం ఇప్పటికే 80 90 శాతం తగ్గిందని మంత్రి చెప్పారు. గతంలో 12 నిమిషాల వరకు ఉండే నిరీక్షణ కొన్ని చోట్ల 30 నిమిషాలకు చేరేదన్నారు. ఇప్పుడు మిగిలిన ఆలస్యాన్ని కూడా సాంకేతికతతో తొలగించనున్నట్లు వివరించారు. ఫాస్టాగ్‌ను 2016లో ప్రవేశపెట్టారు. 2021లో దేశవ్యాప్తంగా తప్పనిసరి చేశారు. వాహనం టోల్ ప్లాజాను దాటుతున్నప్పుడు ఫాస్టాగ్ ద్వారా అనుసంధానిత ఖాతా నుంచి రుసుము ఆటోమేటిక్‌గా కట్ అవుతుంది. నగదు చెల్లింపులతో పాటు చిల్లర కోసం ఎదురుచూడాల్సిన అవసరం లేకపోవడంతో టోల్ వసూళ్లు వేగంగా మారాయి. ఇక తదుపరి దశలో టోల్ ప్లాజాల వద్ద అడ్డంకులే లేకుండా వాహనాలు నేరుగా వెళ్లేలా వ్యవస్థను రూపొందిస్తున్నారు.

## ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సముద్ర భద్రత కీలకం: ప్రధాని మోదీ

ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సముద్రయాన స్వేచ్ఛ, నావికుల భద్రత అత్యంత కీలకమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఇటీవల కాలంలో సముద్ర వాణిజ్యానికి, సరఫరా వ్యవస్థలకు (సప్లై చైన్స్) ఎదురవుతున్న అంతరాయాల పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సురక్షితమైన, పటిష్ఠమైన సరఫరా గొలుసులకు, నౌకాయాన స్వేచ్ఛకు భారత్ ఎప్పుడూ మద్దతు ఇస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. శుక్రవారం న్యూఢిల్లీలో జరిగిన 'బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్'లో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో బ్రిక్స్ కూటమి ప్రాధాన్యం దినదినాభివృద్ధి చెందుతోందని మోదీ పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచ జనాభాలో 50 శాతం, ప్రపంచ జీడీపీలో 40 శాతం, అంతర్జాతీయ వాణిజ్యంలో 25 శాతానికి పైగా వాటాను బ్రిక్స్ దేశాలు కలిగి ఉన్నాయని వివరించారు. ప్రపంచ జీడీపీ సుమారు 2.5 రెట్లు వృద్ధి చెందగా, బ్రిక్స్ దేశాల ఉమ్మడి జీడీపీ ఏకంగా 4.5 రెట్లు పెరిగిందని, ఇది ప్రపంచ సగటు వృద్ధి కన్నా దాదాపు రెట్టింపు అని వెల్లడించారు. బ్రిక్స్ దేశాలు సరికొత్త ఆవిష్కరణలకు కేంద్రాలుగా మారుతున్నాయని ప్రధాని ప్రశంసించారు. ఈ ఆర్థిక శక్తిని ప్రపంచానికి మేలు చేకూర్చే ఆచరణాత్మక పరిష్కారాలుగా మలచాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం బ్రిక్స్ సభ్య దేశాల మధ్య పెట్టుబడులు, వాణిజ్య భాగస్వామ్యాలు మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఇప్పటివరకు నిర్వహించిన బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్‌లలో ఇదే అతిపెద్దదని, దీనికి భారత్ ఆతిథ్యం ఇవ్వడం గర్వకారణమని పేర్కొన్నారు.

## ఏఐతో ఐసిస్ వల టార్గెట్ భారత యువత

ఐసిస్, అల్‌ఖైదా వంటి భయానక ఉగ్రవాద సంస్థలు తమ పంథాను పూర్తిగా మార్చుకున్నాయి. భౌతిక దాడుల స్థానంలో భావజాల వ్యాప్తి, రాడికలైజేషన్‌ను ప్రధాన అస్త్రంగా ఎంచుకున్నాయి. ఈ ప్రమాదకర వ్యూహాన్ని అమలు చేసేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ను విస్తృతంగా ఉపయోగించుకుంటున్నాయని ఐక్యరాజ్యసమితి (ఐరాస) నివేదిక హెచ్చరించింది. ముఖ్యంగా భారత్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా మహిళలు, చిన్నారులను లక్ష్యంగా చేసుకుని వారిని తీవ్రవాద భావజాలం వైపు ఆకర్షిస్తున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. ఐక్యరాజ్యసమితికి చెందిన 'కౌంటర్‌టెర్రరిజం కమిటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరేట్' (సీటీఈడీ) విడుదల చేసిన తాజా నివేదికలో ఈ సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఉగ్రవాద సంస్థలు ఏఐ, ముఖ్యంగా జెనరేటివ్ ఏఐ సహాయంతో వివిధ వర్గాలకు అనుగుణంగా ప్రచార కంటెంట్‌ను వేగంగా రూపొందిస్తున్నాయని తెలిపింది. పురుషులు, మహిళలు, యువతులు, యువకులు, చిన్నారులు.. ఇలా ప్రతి ఒక్కరి మానసిక స్థితికి తగ్గట్టుగా సందేశాలను తయారుచేసి, వాటిని వేగంగా వ్యాప్తి చేస్తున్నాయని పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా ప్రతిచోటా ఇస్లామిక్ రాజ్యాన్ని స్థాపించాలనే లక్ష్యంతోనే ఈ ప్రచారాన్ని ఉద్ధృతం చేశాయని వివరించింది. భారత ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) అధికారులు కూడా ఈ పరిణామాలను ధ్రువీకరిస్తున్నారు. భారత్‌లో ఐసిస్, అల్‌ఖైదా సంస్థలు ఏఐని ఉపయోగించి మహిళలు, చిన్నారులను ప్రత్యేకంగా లక్ష్యం చేసుకున్నాయని ఓ అధికారి తెలిపారు. చిన్న వయసులోనే పిల్లల బలహీనతలను ఆసరాగా చేసుకుని, వారిలో తీవ్రవాద భావజాలాన్ని నింపి భవిష్యత్తుకు సిద్ధం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అమ్మాయిలను, యువతులను ఆకర్షించేందుకు రక్షణ, గుర్తింపు వంటి అంశాలను వాడుకుంటుండగా.. అబ్బాయిలను హింస ద్వారానే శక్తి, గౌరవం లభిస్తాయనే పద్ధతిలో రెచ్చగొడుతున్నారని ఐరాస నివేదిక స్పష్టం చేసింది. ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో ఈ ఏఐ ఆధారిత ప్రచార నమూనాను ఐసిస్ విజయవంతంగా ఉపయోగిస్తోందని, నిఘా వర్గాలు గుర్తించాయి. ఇలా భావజాల వ్యాప్తికి గురైన వారు నేరుగా దాడులకు పాల్పడకుండా నిశ్శబ్దంగా తమ పనిని చేసుకుపోతుండటంతో వీరిని గుర్తించడం కష్టంగా మారుతోందని అధికారులు చెబుతున్నారు. భవిష్యత్తులో లష్కరే తోయిబా, జైషే మహమ్మద్ వంటి ఇతర ఉగ్రవాద సంస్థలు కూడా ఇదే పంథాను అనుసరించే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## ఎడారిలో కొత్త నగరం 6,000 ఇళ్లతో 'మాన్యుమెంట్ హిల్స్'

లాస్ వెగాస్‌లో భారీ రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. నగరంలో పెరుగుతున్న గృహ అవసరాలను తీర్చే లక్ష్యంతో 'మాన్యుమెంట్ హిల్స్' పేరుతో ఒక భారీ మాస్టర్‌ప్లాన్డ్ కమ్యూనిటీని నిర్మించేందుకు డెవలపర్లు సిద్ధమయ్యారు. ఇందుకోసం 94 మిలియన్ డాలర్లు వెచ్చించి సుమారు 940 ఎకరాల ఫెడరల్ ఎడారి భూమిని కొనుగోలు చేశారు. ఒలింపియా కంపెనీస్, బ్రాయిన్ క్యాపిటల్ పార్ట్‌నర్స్ సంస్థలు సంయుక్తంగా ఈ ప్రాజెక్టును చేపట్టనున్నాయి. లాస్ వెగాస్ ఉత్తర సరిహద్దులో, లాస్ వెగాస్ పైయూట్ తెగకు చెందిన స్నో మౌంటెన్ రిజర్వేషన్‌కు సమీపంలో ఈ భూమి ఉంది. బ్యూరో ఆఫ్ ల్యాండ్ మేనేజ్‌మెంట్ (బీఎల్ఎం) ఈ భూమిని లాస్ వెగాస్ నగరానికి విక్రయించగా, నగరం దానిని డెవలపర్లకు కేటాయించింది. గత రెండు దశాబ్దాలలో లాస్ వెగాస్ వ్యాలీలో బీఎల్ఎం చేపట్టిన అతిపెద్ద భూ విక్రయం ఇదే కావడం గమనార్హం. ఈ ప్రాజెక్టులో భాగంగా, సామాన్యులకు అందుబాటులో ఉండే ఇళ్ల నుంచి అత్యాధునిక ఎగ్జిక్యూటివ్ గృహాల వరకు మొత్తం 6,000 ఇళ్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సమీపంలోని సైనిక స్థావరాలను దృష్టిలో ఉంచుకుని, సైనిక కుటుంబాలు, ఇతర ఉద్యోగుల కోసం వందలాది గృహాలను ప్రత్యేకంగా కేటాయించారు. వీటితో పాటు రెండు పాఠశాలలు, వాణిజ్య సముదాయాలు, సుమారు 90 ఎకరాల్లో పార్కులు, వాకింగ్ ట్రయల్స్‌ను కూడా అభివృద్ధి చేయనున్నారు. 2028 వసంతకాలం నాటికి తొలి దశ ఇళ్లు అందుబాటులోకి వస్తాయని అంచనా వేస్తున్నారు. భూ విక్రయం ద్వారా వచ్చిన 94 మిలియన్ డాలర్ల ఆదాయంలో 85 శాతం నిధులను రాష్ట్రవ్యాప్తంగా పార్కులు, పర్యావరణ పరిరక్షణ, అటవీ ప్రాంతాల అభివృద్ధి వంటి ప్రాజెక్టులకు వినియోగించనున్నారు. మరో 5 శాతాన్ని విద్యారంగానికి, 10 శాతాన్ని దక్షిణ నెవాడా నీటి అథారిటీకి కేటాయించారు. రాబోయే దశాబ్దంలో నెవాడా జనాభా భారీగా పెరగనుందన్న అంచనాల నేపథ్యంలో, ఈ ప్రాజెక్ట్ గృహ కొరతను నివారించడంలో కీలక పాత్ర పోషిస్తుందని భావిస్తున్నారు.

## సంపాదకీయం

# సంక్షేమ భారంతో కుదేలవుతున్న బ్రిటన్
# చంద్రబాబు హెచ్చరికలోని వాస్తవం

చంద్రబాబు నాయుడు ఎప్పుడూ ఒక హెచ్చరిక చేస్తూ ఉంటారు. ఏ దేశంలోనైనా వృద్ధ జనాభా, యువత జనాభా సమతుల్యంగా ఉండకపోతే ఆ దేశం తీవ్ర సమస్యలను ఎదుర్కోవలసి వస్తుంది అని. అందుకనే పిల్లలను ఎక్కువకనే వారికి కొన్ని రాయితీలు ఇవ్వడానికి కూడా చంద్రబాబు ప్రభుత్వం సిద్ధపడింది. ఆ విషయం ఆయన చెప్పగానే ముందుచూపు లేని చాలా మంది హేళనగా మాట్లాడారు. అటువంటి సమతుల్యత లేక వృద్ధుల జనాభా అధికమైపోయి, వారి సంక్షేమం కోసం తంటాలు పడుతున్న యునైటెడ్ కింగ్‌డమ్‌ను చూస్తే చంద్రబాబు నాయుడు హెచ్చరికలో ఉన్న వాస్తవం ఏమిటో బోధపడుతుంది. యునైటెడ్ కింగ్‌డమ్ అనగానే మనకు ముందు గుర్తుకొచ్చేది లండన్. ఎందుకంటే భారతదేశం నుండి, పాకిస్తాన్ నుండి పారిపోవాలని కోరుకునే వారు వెళ్లేది లండన్. భారత ఉపఖండం నుండి ఉన్నత చదువులు చదవాలని కోరుకునే వారు వెళ్లేది బ్రిటన్. బ్రిటన్‌లోని కొన్ని విశ్వవిద్యాలయాలలో చదువు అప్పుడూ, ఇప్పుడూ, ఎప్పుడూ ప్రత్యేకమే. ఇక భారతీయుల గుండెలను మెలితిప్పి, గేట్లు మూసి విచక్షణారహితంగా కాల్పులు జరిపించిన జనరల్ డయ్యర్‌ను రుద్దిందీ ఆ దేశమే; గోదావరి తీరాన్ని సస్యశ్యామలం చేసి గోదావరి జిల్లాల ప్రజల దేవుడి గదిలో చోటు సంపాదించుకున్న సర్ ఆర్థర్ కాటన్ దొరను ఇచ్చిందీ అదే దేశం. ఆనాటి రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యంలోని అధికార కేంద్రం యొక్క ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు అస్తవ్యస్తంగా మారింది. ఇది మన ప్రభుత్వం చెప్పే జీడీపీ లెక్క కాదు; అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ వ్యవహారం అంతకన్నా కాదు. ప్రపంచంలో భారతదేశం ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కావచ్చు; యునైటెడ్ కింగ్‌డమ్ మన తర్వాతి స్థానంలో ఉండవచ్చు. కానీ మన తలసరి ఆదాయం సంవత్సరానికి మన రూపాయల్లో 2,30,000/- నుండి 2,50,000/- మాత్రమే. అదే యునైటెడ్ కింగ్‌డమ్‌లో తలసరి ఆదాయం 42 లక్షల నుండి 45 లక్షల రూపాయలు. అంటే మనకంటే దాదాపు పదిరెట్లు ఎక్కువ ఆదాయం ఆ దేశ పౌరులకు ఉన్నది. ఇప్పటికీ ఆ దేశంలో ఉపాధి వనరులు, ఆదాయ వనరులు పుష్కలంగా ఉన్నాయి. లండన్ నగరం ప్రపంచ ఆర్థిక కేంద్రాలలో ఒకటి. సాంస్కృతిక పరంగా ఒక ప్రత్యేకత కలిగిన దేశం ఇంగ్లాండ్. అందువల్లనే రాచరిక వ్యవస్థను, పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని కలగలిపి అక్కడ పాలన సాగించడం సాధ్యపడుతోంది. యునైటెడ్ కింగ్‌డమ్ యొక్క పారిశ్రామిక చరిత్ర సుదీర్ఘమైనది. ఔషధ రంగం, రక్షణ రంగ ఉత్పత్తులు, ఆటోమొబైల్ రంగ ఉత్పత్తులు, అధునాతన ఎలక్ట్రానిక్ పరికరాల తయారీలో ప్రపంచంలోనే అగ్రగామిగా ఉన్న దేశాలలో బ్రిటన్ ఒకటి. ఆ తర్వాత సేవా రంగం వైపు మొగ్గు చూపడం వలన జీడీపీలో సేవా రంగం ఆదాయం పెరిగింది. అయితే, అన్ని అభివృద్ధి చెందిన దేశాల మాదిరిగానే స్థిరమైన పరిస్థితుల్లో సాగుతున్న బ్రిటన్ ఆర్థికాభివృద్ధి ప్రస్తుతం మందగించింది. నిరుద్యోగ సమస్య పెద్దగా లేకుండానే ఆర్థిక ఒడిదుడుకులు మొదలయ్యాయి. ప్రజలు జీవన వ్యయ సంక్షోభంలో చిక్కుకున్నారు. ప్రభుత్వ అప్పు జీడీపీలో 94 శాతంగా ఉన్నది. అభివృద్ధి చెందిన దేశాలకు 94 శాతం అప్పు పెద్ద ప్రమాదం కాకపోవచ్చు. అమెరికా ప్రభుత్వ అప్పు ఇంతకంటే ఎక్కువే ఉన్నది. కానీ ఈ దేశాలకు స్వంత కరెన్సీతో కూడిన బలమైన ఆర్థిక వ్యవస్థలు ఉంటాయి కాబట్టి కొంతకాలం పాటు ఒత్తిడిని తట్టుకోగల శక్తి ఉంటుంది; పెట్టుబడిదారులు కూడా వెంటనే వెనక్కి వెళ్లిపోరు. అదే స్థాయి అప్పు భారతదేశం లాంటి దేశానికి ఉంటే పెట్టుబడిదారులకు విశ్వాసం తగ్గి, తమ పెట్టుబడులను ఉపసంహరించుకుని వెళ్లిపోతారు. అయితే అభివృద్ధి చెందిన దేశాలలో కూడా అప్పు అలాగే కొనసాగితే భవిష్యత్తులో వారు సైతం తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. బ్రిటన్ ప్రస్తుత పరిస్థితికి బ్రెక్సిట్ లాంటి అనేక కారణాలతో పాటు, ఉద్యోగం చేయలేని వారి సంఖ్య పెరగడం కూడా మరో ప్రధాన కారణం. విశ్రాంత జీవితం గడపడానికి బ్రిటన్‌ను మించిన దేశం ప్రపంచంలో మరొకటి లేదు. ఒకప్పుడు సంక్షేమానికి పెద్దపీట వేసిన బ్రిటన్, ఈరోజు అదే సంక్షేమాన్ని చూసి భయపడుతోంది. బ్రిటన్‌లో ప్రతి ఐదుగురు పౌరులలో ఒకరు వయోవృద్ధులు ఉన్నారు. వృద్ధ జనాభా సంఖ్య వేగంగా పెరుగుతోంది. బ్రిటన్‌లో వృద్ధుల జీవన ప్రమాణాల స్థాయికి తగిన విధంగా ప్రభుత్వం పెన్షన్లు ఇస్తుంది; వైద్యం పూర్తిగా ఉచితం; వారి కోసం ప్రత్యేక సంరక్షణ కేంద్రాలను నడుపుతుంది; ఇంటి అద్దెల దగ్గర నుండి విద్యుత్ చార్జీల వరకు ప్రభుత్వమే భరిస్తుంది. అటువంటిది, విపరీతంగా పెరిగిన వృద్ధ జనాభాను సంరక్షించడం ఇప్పుడు బ్రిటన్‌కు ఆర్థికంగా భారంగా మారింది. ద్రవ్యోల్బణం పెరగడం, దైనందిన జీవనానికి అవసరమైన వస్తువుల ధరలు ఆకాశాన్నంటడంతో ప్రభుత్వం ఇచ్చే పెన్షన్ చాలక ఉచిత ఆహార కేంద్రాలపై తీవ్ర ఒత్తిడి పెరిగింది. శీతాకాలంలో ఇళ్లను వేడిగా ఉంచుకోవడానికి ప్రభుత్వం ఇచ్చే 'వింటర్ ఫ్యూయెల్ అలవెన్స్' పై పరిమితులు విధించడం వృద్ధుల ఆరోగ్యం పాలిట శాపంగా మారింది. చివరకు వృద్ధులు ఆహారం కొనుగోలు చేయాలా లేక ఇంటిని వెచ్చగా ఉంచుకోవాలా అనే సందిగ్ధాన్ని ఎదుర్కొంటున్నారు. వైద్యం ఉచితమైనప్పటికీ, సిబ్బంది కొరత కారణంగా వైద్యుల అపాయింట్‌మెంట్ దొరకడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. అదే సమయంలో ప్రభుత్వ సంరక్షణ కేంద్రాలు కూడా సిబ్బంది లేక బోసిపోతున్నాయి. లండన్ నగర ఆర్థిక పరిస్థితి, జీవన పరిస్థితులు మరింత సంక్లిష్టమైన సవాళ్లతో కూడుకుని ఉన్నాయి. అక్కడ వృద్ధులు నివాసం ఉండటం అనేది ఊహకు కూడా అందని పరిస్థితిగా మారింది. ఇంటి అద్దెలు భరించలేక, ప్రభుత్వం ఇచ్చే పెన్షన్ చాలక చాలామంది వలసపోతున్నారు. వీటికి తోడు బ్రిటన్‌లో వృద్ధులు తీవ్ర ఒంటరితనంతో ఇబ్బంది పడుతున్నారు. దేశంలో ఉన్న సుమారు ఆరున్నర కోట్ల జనాభాలో ఇరవై శాతం ఉన్న వృద్ధుల్లో దాదాపు నలభై లక్షల మంది ఒంటరిగానే జీవిస్తున్నారు. దాని పర్యవసానంగా వారిలో మానసిక సమస్యలు పెరిగిపోతున్నాయి. ప్రభుత్వం, స్థానిక కౌన్సిళ్లు ఇచ్చే ఆర్థిక సాయం కూడా దేనికీ సరిపోవడం లేదు. మరోవైపు ఏ సౌకర్యం పొందాలన్నా డిజిటల్ యాప్‌లపై ఆధారపడవలసి రావడం వృద్ధులకు పెను సమస్యగా మారింది. ఇది ప్రపంచ దేశాలన్నీ ఎదుర్కొంటున్న సమస్యే అయినప్పటికీ, బ్రిటన్ వృద్ధులు మరింత తీవ్రంగా ఎదుర్కొంటున్నారు. యాప్‌ల ద్వారా సేవలు పొందడం, అపాయింట్‌మెంట్ల కోసం స్మార్ట్‌ఫోన్ ఉపయోగించడం చేతకాక చాలామంది సకాలంలో వైద్యం చేయించుకోలేకపోతున్నారు. "ఎక్కువ సంపాదన కావాలంటే అమెరికా వెళ్లాలి; సురక్షితమైన జీవితం, ఉచిత వైద్యంతో కూడిన సంక్షేమం కావాలనుకుంటే బ్రిటన్‌లో ఉండాలి" అనే నానుడి ఇప్పుడు కాలం చెల్లిన మాటైపోయింది. నార్వే లాంటి దేశాలు కూడా నేడు ఇటువంటి సమస్యలనే ఎదుర్కొంటున్నాయి. ప్రస్తుతం మనం యువభారతంతో కళకళలాడుతున్న సమయంలోనే, భవిష్యత్తులో దేశానికి వృద్ధాప్య భారం కాకుండా ఇప్పటినుంచే సమతుల్యతను కాపాడుకోవలసిన అవసరం ఉన్నదనేది చంద్రబాబు నాయుడు లాంటి దార్శనికుల ఆలోచన.!

- ఇంద్రాణి

## చరిత్రలో ఈ రోజు
### సెప్టెంబర్ 12

SEPT 12

* 1886: ప్రఖ్యాత హిందుస్తానీ గాయకుడు సవాయి గంధర్వ జననం (మ.1952).
* 1920: ప్రఖ్యాత నేత్రవైద్య నిపుణుడు పెరుగు శివారెడ్డి జననం (మ.2005).
* 1921: తమిళ కవి, స్వాతంత్ర్య సమర యోధుడు సుబ్రహ్మణ్య భారతి మరణం (జ.1882).
* 1943: ఆధునిక తెలుగు నిఘంటుకర్త రవ్వా శ్రీహరి జననం.
* 1972: ఆంగ్ల నటుడు, మార్షల్ ఆర్టిస్ట్ జాసన్ స్టాథమ్ జననం.
* 2009: హరిత విప్లవ పితామహుడు నార్మన్ బోర్లాగ్ మరణం (జ.1914).



సీతారాం ఏచూరి

* 2024: ప్రముఖ రాజకీయ నాయకుడు, కమ్యూనిస్ట్ యోధుడు సీతారాం ఏచూరి మరణం (జననం 1952). (చిత్రంలో)

## అల్పపీడన ప్రభావంతో
# ఏపీలో వర్షాలు.. అప్రమత్తమైన ప్రభుత్వం



హైదరాబాద్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం దక్షిణ ఒడిశా ఉత్తరాంధ్ర తీర ప్రాంతాల్లో కేంద్రీకృతం కావడంతో ఏపీ ప్రభుత్వం అప్రమత్తమైంది. రానున్న మూడు రోజుల పాటు ఉత్తరాంధ్రలో మోస్తరు నుంచి భారీ వర్షాలు , దక్షిణ కోస్తాలో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఎలాంటి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. వర్ష ప్రభావిత జిల్లాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి, వాతావరణ హెచ్చరికలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేయాలని సూచించారు. తీర ప్రాంతాల్లో గంటకు 50 నుంచి 70 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లొద్దని, ఇప్పటికే సముద్రంలో ఉన్నవారు సురక్షితంగా తీరానికి చేరుకోవాలని హోం మంత్రి సూచించారు. అత్యవసర సహాయం కోసం 112, 1070, 1800 425 0101 నంబర్లను సంప్రదించాలని ప్రభుత్వం తెలిపింది.





## కొవ్వూరులో పట్టాలు తప్పిన గూడ్స్ రైలు..
# రాకపోలకు అంతరాయం

కొవ్వూరు: తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు రైల్వేస్టేషన్ సమీపంలో నాలుగో లైన్‌పై గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. శుక్రవారం ఉదయం ఎరువుల లోడుతో విజయవాడ వైపు వెళ్తున్న గూడ్స్ రైలు 8 బోగీలు పట్టాలు తప్పాయి. దీంతో పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నర్సీపట్నం, తుని, అన్నవరం, నిడదవోలు, రాజమండ్రి స్టేషన్లలో ఎక్కడికక్కడ రైళ్లను నిలిపివేశారు. ఇవాళ ఉదయం 9.15 గంటలకు కొవ్వూరు స్టేషన్‌లో రెండో ప్లాట్‌ఫామ్‌పైకి వచ్చిన వందేభారత్ రైలు నిలిచిపోయింది. విజయవాడ వైపు వెళ్లే రైళ్లన్నీ ఆలస్యంగా నడుస్తున్నాయి.

## నేతన్న భరోసా పెన్షన్ దరఖాస్తు కోసం
# బ్యాంక్ స్టేట్‌మెంట్ అవసరం లేదు: సవిత

- **మాస్టర్ వీవర్ ఇచ్చే ధ్రువీరణ పత్రం, వేతన వివరాలు ఇస్తే సరిపోతుందన్న సవిత**
- **బ్యాంక్ స్టేట్‌మెంట్ సేకరణలో కార్మికులు ఇబ్బంది పడుతున్నారన్న మంత్రి**
- **అర్హులైన నేతన్నలందరికీ పింఛన్లు ఇస్తామని హామీ**



ఆంధ్రప్రదేశ్‌లోని చేనేత కార్మికులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించింది. 'నేతన్న భరోసా' పెన్షన్ పథకం దరఖాస్తు ప్రక్రియలో అత్యంత కీలకమైన నిబంధన నుంచి మినహాయింపు ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇకపై పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునే నేతన్నలు బ్యాంక్ ఖాతా సమర్పించాల్సిన అవసరం లేదని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత వెల్లడించారు. బ్యాంక్ స్టేట్‌మెంట్‌కు ప్రత్యామ్నాయంగా సంబంధిత మాస్టర్ వీవర్ (సొసైటీ/యజమాని) ఇచ్చే ధ్రువీకరణ పత్రంతో పాటు వేతన వివరాల పత్రాన్ని అందిస్తే సరిపోతుందని మంత్రి స్పష్టం చేశారు. బ్యాంకు ఖాతా స్టేట్‌మెంట్ల సేకరణలో అర్హులైన చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సాంకేతిక ఇబ్బందులను గమనించి ప్రభుత్వం ఈ సులభతర నిర్ణయాన్ని తీసుకున్నట్లు తెలిపారు. 50 ఏళ్లు నిండిన అర్హులైన నేతన్నలందరికీ తప్పకుండా పింఛన్లు మంజూరు చేస్తామని, నేతన్నల సంక్షేమానికి తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందోనని అన్నారు.

# మద్రాస్ రెజిమెంట్ ఆర్మీ ఆయుధాల చోరీ కేసులో కీలక పరిణామం

హైదరాబాద్: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సికింద్రాబాద్ బొల్లారంలోని మద్రాస్ రెజిమెంట్ ఆర్మీ ఆయుధాల చోరీ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. చోరీకి గురైన ఆయుధాలు, మ్యాగజైన్స్, బుల్లెట్స్, బైనాక్యులర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి ఆర్మీ విశ్రాంత అధికారితో పాటు మరో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు సమాచారం. ఆయుధాల చోరీ కేసులో బొల్లారం, మల్కాజిగిరి పోలీసులు, ఎన్ఐఏ, ఆర్మీ ఇంటెలిజెన్స్ అధికారులు గత కొన్ని రోజులుగా దర్యాప్తు చేస్తున్న విషయం తెలిసిందే. చోరీకి గురైన ఆయుధాలను మహబూబ్‌నగర్‌లో ఉంటున్న ఆర్మీ విశ్రాంత అధికారి నివాసంలో టాస్క్ ఫోర్స్ పోలీసులు నిన్న రాత్రి స్వాధీనం చేసుకున్నట్టు తెలుస్తోంది. మద్రాస్ రెజిమెంట్‌లో ఆయుధాలు భద్రపరిచే ప్రాంతం (కోటె)లో బెల్ ఆఫ్ ఆర్మ్స్ ఇన్‌ఛార్జి, బుల్లెట్స్ ఇచ్చే అమ్నిషన్



సెక్షన్ ఇన్‌ఛార్జి ఉంటారు. వీరిద్దరి సహకారంతోనే విశ్రాంత ఆర్మీ అధికారి.. వీలు చిక్కినప్పుడల్లా చోరీకి పాల్పడి ఉంటారని అనుమానిస్తున్నారు. దీనికి సంబంధించి పోలీసులు మాత్రం ఇప్పటి వరకు ఎలాంటి వివరాలను బయటపెట్ట లేదు. మల్కాజిగిరి సీపీ.. ఆర్మీ అధికారులతో కలిసి ఇవాళ సాయంత్రం లేదా రేపు.. మీడియాకు వివరాలు వెల్లడించే అవకాశముందని సమాచారం.

## టీటీడీ స్కూళ్లలో తన ఇద్దరు కుమారులు.. ఐఏఎస్ అధికారి గోపీనాథ్ స్ఫూర్తిదాయక నిర్ణయం

ఉన్నత హోదాలో ఉన్న అధికారులు తమ పిల్లలను ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో చదివించడం సాధారణంగా కనిపిస్తుంటుంది. కానీ, దీనికి భిన్నంగా టీటీడీ జేఈవో, ఐఏఎస్ అధికారి ప్రభల గోపీనాథ్ ఆదర్శనీయమైన నిర్ణయం తీసుకున్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న తన ఇద్దరు కుమారులను టీటీడీ ఆధ్వర్యంలోని పాఠశాలల్లో చేర్పించి అందరి దృష్టిని ఆకర్షించారు. వివరాల్లోకి వెళితే.. గ్రూప్ 1 అధికారిగా సర్వీసులో చేరి ఐఏఎస్ హోదా పొందిన ప్రభల గోపీనాథ్, గత ఆగస్టు నెలలోనే టీటీడీ జేఈవో (వైద్యం, విద్య)గా బాధ్యతలు చేపట్టారు. తాజాగా ఆయన తన పెద్ద కుమారుడు ఆనంద్ మహిత్‌ను తిరుపతిలోని ఎస్‌జీఎస్ ఉన్నత



పాఠశాలలో 7వ తరగతిలో, చిన్న కుమారుడు నాగ అనీష్ అగస్త్యను ఎస్వీ ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతిలో చేర్పించారు. తాను బాధ్యతలు నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై నమ్మకంతోనే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టమవుతోంది. అంతేకాకుండా గోపీనాథ్ సతీమణి ప్రతిరోజూ స్వయంగా పిల్లలను పాఠశాలకు తీసుకెళ్లి, సాయంత్రం తిరిగి ఇంటికి తీసుకువస్తున్నారు. ప్రభుత్వ, ట్రస్ట్ ఆధ్వర్యంలోని విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్య అందుబాటులో ఉందనే బలమైన సందేశాన్ని తన చర్య ద్వారా చాటిచెప్పిన జేఈవో గోపీనాథ్‌పై సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఆయన నిర్ణయం ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## పూర్తి పారదర్శకంగా డీఎస్సీ నిర్వహించాం.. దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి చర్చించు జగన్: కేశినేని

- **డీఎస్సీతో 16 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చామన్న కేశినేని చిన్ని**
- **డీఎస్సీకి, ఏపీపీఎస్సీకి మధ్య తేడా కూడా తెలియని వ్యక్తి జగన్ అని విమర్శ**
- **ఐదేళ్ల పాలనలో జగన్ ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని మండిపాటు**

ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం డీఎస్సీ పరీక్షలను అత్యంత పారదర్శకంగా నిర్వహించి 16 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించిందని విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని స్పష్టం చేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నిర్వహించిన ఈ మెగా డీఎస్సీపై వైసీపీ అధినేత జగన్, ఆ పార్టీ నేతలు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. డీఎస్సీపై బహిరంగ చర్చకు రావాలని లోకేశ్ సవాల్ విసిరినా జగన్ ఇంతవరకు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. త్వరలోనే లోకేశ్ నాయకత్వంలో మరో మూడు డీఎస్సీలను విజయవంతంగా నిర్వహించి తీరుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. డీఎస్సీ, ఏపీపీఎస్సీ నిర్వహణకు ఉన్న ప్రాథమిక వ్యత్యాసం కూడా తెలీని వ్యక్తి జగన్ అని కేశినేని చిన్ని ఎద్దేవా చేశారు. స్పోర్ట్స్ కోటాలో ప్రత్యేకంగా పరీక్షలు ఉండవని, ఆ కేటాయింపులు నేరుగా సర్టిఫికెట్ల ఆధారంగా, మెరిట్ ప్రకారం జరుగుతాయని తెలిసినా వైసీపీ అసత్యాలు ప్రచారం చేస్తోందన్నారు. ప్రైవేట్ పాఠశాలలో పనిచేస్తున్న



రామకృష్ణ అనే వ్యక్తికి డీఎస్సీలో ఉద్యోగం వస్తే, ఆయనకు రానట్లు సాక్షి పత్రికలో అబద్ధాలు రాశారని, ఆ బాధితుడు రామకృష్ణ స్వయంగా ఇక్కడే సజీవ సాక్ష్యంగా ఉన్నారని మీడియా ముందు ప్రదర్శించారు. ఐదేళ్ల పాలనలో ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వని జగన్, తొమ్మిది నెలలుగా కుంభకర్ణుడిలా నిద్రపోయి ఇప్పుడు గ్లోబల్ ప్రచారంతో ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సొంత బాబాయి వివేకానందరెడ్డి హత్య కేసులో గొడ్డలిపోటును గుండెపోటుగా చిత్రీకరించడం, కోడికత్తి డ్రామాలు ఆడటం జగన్‌కు అలవాటేనని ఎంపీ ధ్వజమెత్తారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏపీపీఎస్సీ, గ్రూప్ 1 నియామకాలలో జరిగిన భారీ అవకతవకలపై ప్రస్తుతం కోర్టు ఆదేశాల మేరకు విచారణ జరుగుతోందని తెలిపారు. ఆ అక్రమాల నివేదిక బయటకు వచ్చి తమ తప్పులు బయటపడతాయనే భయంతోనే డీఎస్సీపై వైసీపీ నేతలు బురద జల్లుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఇచ్చిన సమాచారం తప్పని నిరూపించే దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలని జగన్‌కు సవాల్ విసిరారు. ఇటువంటి దిగజారుడు రాజకీయాలు చేస్తే వచ్చే ఎన్నికల్లో జగన్ కనీసం ఎమ్మెల్యేగా కూడా గెలవలేరని జోస్యం చెప్పారు.

## రెండు డీఏలు విడుదల చేస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు

అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పింఛనుదారులకు రెండు డీఏలు విడుదల చేస్తూ ఏపీ ఆర్థిక శాఖ ఉత్తర్వులు (AP Govt) జారీ చేసింది. పెంచిన డీఏలను (DA) సెప్టెంబర్ జీతానికి కలిపి చెల్లించాలని పేర్కొంది. 1.82 శాతం డీఏను 2025 జనవరి 1 నుంచి చెల్లించనుంది. 20




నెలల బకాయిలు 2028 జనవరి, మార్చి, మే, జులైలో ఇవ్వనుంది. 2.73 శాతం డీఏను 2024 జులై 1 నుంచి చెల్లించనుంది. 26 నెలల బకాయిలు 2027 ఏప్రిల్, జూన్, ఆగస్టు, అక్టోబరులో జమ చేయనుంది. పింఛనుదార్లకు కూడా ఇదే షెడ్యూల్‌లో డీఏ బకాయిలు చెల్లించాల్సిందిగా ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పియూష్‌కుమార్ పేర్కొన్నారు.

### "రెండేళ్ల నమ్మకం – సంక్షేమం, అభివృద్ధి"

## డోర్ టు డోర్ కార్యక్రమంలో సయ్యద్ మెహతాజ్ బేగం

రైల్వే కోడూరు నియోజకవర్గం | తిరుపతి జిల్లా కోడూరు మండలం | బూత్ నెంబర్ 84 | వెంకటేశ్వరపురం - బాలాజీ నగర్ రైల్వే కోడూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి శ్రీ ముక్కా రూపానంద రెడ్డి గారి ఆధ్వర్యంలో "రెండేళ్ల నమ్మకం - సంక్షేమం, అభివృద్ధి" డోర్ టు డోర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కోడూరు మండలంలోని బూత్ నెంబర్ 84 పరిధిలో వెంకటేశ్వరపురం, బాలాజీ నగర్ ప్రాంతాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి సయ్యద్ మెహతాజ్ బేగం పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం రెండేళ్ల పాలనలో చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల ద్వారా పేదలు, మహిళలు, వృద్ధులు, విద్యార్థులు, రైతులు, మైనారిటీలు తదితర వర్గాలకు అందుతున్న ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా సయ్యద్ మెహతాజ్ బేగం మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. సంక్షేమ పథకాలతో పాటు మౌలిక వసతుల అభివృద్ధి, విద్య, మహిళా సాధికారత, రైతుల సంక్షేమం, యువతకు



అవకాశాలు కల్పించడం వంటి అంశాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. "రెండేళ్ల నమ్మకం - సంక్షేమం, అభివృద్ధి" కార్యక్రమం ద్వారా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించడంతో పాటు ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవడం జరుగుతోందని ఆమె తెలిపారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అవగాహన కల్పించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని చెప్పారు. ఇంటింటికీ వెళ్లిన సయ్యద్ మెహతాజ్ బేగం స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా నెలకొన్న సమస్యలు, ప్రభుత్వ పథకాల అమలుపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను



సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజలతో నేరుగా మమేకమవుతూ వారి సమస్యలను తెలుసుకోవడం ద్వారా ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేయాలని సయ్యద్ మెహతాజ్ బేగం అన్నారు. రానున్న రోజుల్లో కూడా ప్రజల మధ్య ఉంటూ నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా కార్యకర్తలు, అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. వెంకటేశ్వరపురం, బాలాజీ నగర్ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

## 18 వరకు సాధిక్‌ఖాన్‌కు రిమాండ్

అమలాపురం పట్టణం: కాకినాడకు చెందిన పంచాయతీరాజ్ ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య, ఆయన అల్లుడు జగదీశ్వరరెడ్డి హత్య కేసులో నిందితుడైన సాధిక్‌ఖాన్‌కు మూడు రోజుల పోలీస్‌కస్టడీ శుక్రవారం ముగిసింది. దీంతో సర్పవరం పోలీసులు అమలాపురం కోర్టు ప్రాంగణంలోని కాకినాడ స్పెషల్ మొబైల్ కోర్టులో హాజరుపరిచారు. నిందితుడికి ఈనెల 18 వరకు జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ.. కాకినాడ స్పెషల్ మొబైల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్, అమలాపురం ఒకటో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ (ఇన్‌ఛార్జి)



ఎన్.ఉషాలక్ష్మీకుమారి తీర్పు ఇచ్చారు. అనంతరం సాధిక్‌ఖాన్‌ను రాజమహేంద్రవరం కేంద్రకారాగారానికి తరలించారు.




## ఫేక్ అకౌంట్లతో వైకాపా దుష్ప్రచారం: పల్లా శ్రీనివాస్

విశాఖపట్నం (వన్‌టౌన్): 'స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. సాధారణ ఎన్నికల్లోనూ పార్టీ పరంగా అదే విధానం కొనసాగిస్తాం' అని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. కూటమి పాలనలో బీసీలకు సముచిత స్థానం కల్పిస్తూ వారి సంక్షేమానికి కృషి చేస్తోంటే వైకాపా రిజర్వేషన్ల అంశంపై దుష్ప్రచారం చేస్తోందని.. దీన్ని నేతలు ఎండగట్టాలని సూచించారు. విశాఖపట్నంలోని తెదేపా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'వైకాపా పాలనలో బీసీలు రాజకీయ అవకాశాలు కోల్పోయేలా చేశారు. కూటమి ప్రభుత్వం రిజర్వేషన్లు కల్పించి ప్రోత్సహిస్తుంటే ఆ పార్టీ నాయకులు కోర్టుల్లో కేసులు వేసి అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. బీసీల రక్షణకు తీసుకోవాల్సిన చర్యలు సూచించడానికి సబ్‌కమిటీ నియామకమైంది. బీసీల నిధులను వైకాపా పాలనలో దారి మళ్లించి వారికి తీరని ద్రోహం చేశారు. 2024 సాధారణ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పి 11 సీట్లకు పరిమితం చేసినా ఆ పార్టీ నేతలకు బుద్ధి రాలేదు. కూటమి పార్టీల్లో ఐక్యతను దెబ్బతీసేలా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఫేక్ అకౌంట్ల ద్వారా విష ప్రచారం చేస్తున్నారు. గొడ్డలి పార్టీ విదేశాల్లో తెదేపా, జనసేన పార్టీల తరఫున ఫేక్ అకౌంట్లు సృష్టించి దుష్ప్రచారం చేస్తోంది. ఈ అంశంపై ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవు'' అని పల్లా శ్రీనివాసరావు అన్నారు.



## మద్యం విధానంపై ఏపీ ప్రభుత్వం మార్గదర్శకాలు

అమరావతి: 202627 మద్యం విధానంపై ఏపీ ప్రభుత్వం (AP Govt) ఉత్తర్వులు జారీ చేసింది. మద్యం దుకాణాల మంజూరు, ఫీజుల విధివిధానాలపై మార్గదర్శకాలు విడుదల చేసింది. 2026 అక్టోబర్ 1 నుంచి 2027 సెప్టెంబర్ 30 వరకు ఈ విధానం అమల్లో ఉండనుంది. మద్యం దుకాణాల సంఖ్యను పెంచకుండా... మొత్తం 3,396 దుకాణాలను ఓపెన్ కేటగిరీలో కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 340 దుకాణాలను కల్లుగీత కార్మికులకు రిజర్వ్ చేసింది.

## పార్వతీపురంలో ఇంటర్ విద్యార్థుల డిష్యుం.. డిష్యుం..



పార్వతీపురం: పార్వతీపురంలో ఇంటర్ విద్యార్థుల పరస్పరం దాడులకు దిగారు. ఓ ప్రైవేట్ కళాశాల జరిగిన వేడుకలో విద్యార్థుల మధ్య తీవ్ర వివాదం చెలరేగింది. దీంతో వారు బయటకు వచ్చి దాడులు చేసుకున్నారు. విద్యార్థులు గొడవలోకి బయటి వ్యక్తులు ప్రవేశించారు. ఈ ఘటనలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. ప్రధాన రహదారిపైనే ఘర్షణ జరగడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. దీంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. పోలీసులు సమాచారం అందుకున్న అక్కడికి చేరుకుని వారిని చెదరగొట్టారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## పేకల్లో మైక్రో చిప్స్.. కడపలో హైటెక్ మోసం

జూదం అంటేనే మోసం. ధర్మరాజు అంతటివాడే జూదంలో మోసపోయి రాజ్యం పోగొట్టుకొని అడవుల పాలయ్యాడు. ఎంతోమంది జూదం ఆడి డబ్బులు పోగొట్టుకొని రోడ్డున పడ్డారు. భార్య మెడలో పుస్తెలతాడు అమ్మి మరీ జూదమాడి బికారీలు అయ్యారు మరికొందరు. డబ్బులతో జూదం ఆడటం నేరమైనప్పటికీ చాలామంది గుట్టుచప్పుడు కాకుండా కొనసాగిస్తూనే ఉన్నారు. దొంగ పేకలతో నిర్వాహకులు చేసే మోసాలతో అమాయకులు బలైపోయారు. తాజాగా కడప జిల్లాలో కేటుగాళ్లు మరో అడుగు ముందుకేశారు. ఏకంగా పేకల్లోనే మైక్రో చిప్పులు అమర్చి హైటెక్ మోసానికి తెరలేపారు.

# హైదరాబాద్‌లో ఆస్తి కొంటున్నారా? హైడ్రా కొత్త పోర్టల్‌లో ఎఫ్‌టీఎల్ వివరాలు చెక్ చేసుకోండి

- **హైదరాబాద్‌లో హైడ్రా కొత్త వెబ్ పోర్టల్ ప్రారంభం**
- **అందుబాటులో చెరువుల పూర్తిస్థాయి నీటిమట్టం, బఫర్ జోన్ వివరాలు**
- **వరద ముంపు ప్రాంతాల మ్యాపులు, వర్షపాతం సమాచారం కూడా**
- **భూ రికార్డుల కోసం 'భూ భారతి' పోర్టల్‌కు అనుసంధానం**

హైదరాబాద్ పౌరులకు కీలక సమాచారాన్ని ఒకే వేదికపై అందించే దిశగా హైడ్రా కీలక అడుగు వేసింది. ఇందులో భాగంగా శుక్రవారం తన అధికారిక వెబ్‌సైట్/పోర్టల్‌ను ప్రారంభించింది. ఏజెన్సీ కమిషనర్ ఏ.వి. రంగనాథ్ ఈ పోర్టల్‌ను ఆవిష్కరించారు. చెరువులు, వరదలు, భూ రికార్డుల వంటి పలు ముఖ్యమైన సేవలను ఈ పోర్టల్ ద్వారా ప్రజలు సులభంగా పొందవచ్చు. ఈ పోర్టల్ ద్వారా ముఖ్యంగా ఇళ్లు, స్థలాలు కొనుగోలు చేసే వారికి ఎంతో ప్రయోజనం



చేకూరనుంది. చెరువులు, ఇతర నీటి వనరుల సమీపంలో ఆస్తులను కొనుగోలు చేసే ముందు వాటి పూర్తిస్థాయి నీటిమట్టం (FTL), బఫర్ జోన్ వివరాలను దీని ద్వారా ధ్రువీకరించుకోవచ్చు. ఇందుకోసం హెచ్‌ఎండీఏ లేక్స్ పోర్టల్‌కు నేరుగా యాక్సెస్ కల్పించారు. అలాగే జీహెచ్‌ఎంసీ, సైబరాబాద్, మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలోని వరద, నీటి ముంపు ప్రాంతాల ప్రత్యేక మ్యాపులను కూడా ఇందులో పొందుపరిచారు. వీటితో పాటు వాతావరణ సమాచారం, వర్షపాతం వివరాలు, హైదరాబాద్ డాప్లర్ రాడార్ సమాచారం కూడా అందుబాటులో ఉంటాయి. భూ రికార్డుల కోసం తెలంగాణ ప్రభుత్వ 'భూ భారతి' పోర్టల్‌కు నేరుగా లింక్ ఇచ్చారు. దీని ద్వారా సర్వే నంబర్ లేదా పట్టాదారు వివరాలతో భూ సమాచారాన్ని తెలుసుకోవచ్చు. హైడ్రా చేపడుతున్న చెరువుల పునరుద్ధరణ పనుల పురోగతి, ఫొటోలు, వీడియోలను కూడా ఈ పోర్టల్‌లో వీక్షించవచ్చు. ఏజెన్సీ అధికారిక ప్రకటనలు, అత్యవసర సహాయ సమాచారం కూడా ఇందులో లభిస్తాయి.

# కొండా సురేఖకు బుజ్జగింపులు... కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ ఫోన్

- **మాజీ మంత్రి కొండా సురేఖకు ఫోన్ చేసిన మీనాక్షి నటరాజన్**
- **వ్యక్తిగత విభేదాలు పక్కనపెట్టి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచన**
- **అసెంబ్లీ సమావేశాలకు సురేఖ గైర్హాజరు కావడంతో పార్టీలో చర్చ**
- **అధిష్ఠానం ఆదేశాలతోనే ఇన్‌ఛార్జ్ మాట్లాడినట్లు సమాచారం**
- **తదుపరి సమావేశాలకు సురేఖ హాజరవుతారా అన్న దానిపై ఆసక్తి**

తెలంగాణ మాజీ మంత్రి కొండా సురేఖకు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ ఫోన్ చేసినట్లు సమాచారం. ప్రస్తుతం అసెంబ్లీ



సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో, సురేఖతో ఆమె నేరుగా సంభాషించినట్లు తెలియడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. రాష్ట్ర రాజకీయాలు, పార్టీలో చోటుచేసుకుంటున్న తాజా పరిణామాలపై వీరిద్దరి మధ్య చర్చ జరిగినట్లు తెలుస్తోంది. వ్యక్తిగత అంశాలు, అంతర్గత విభేదాలను పక్కనపెట్టి పార్టీ కార్యక్రమాల్లో తిరిగి చురుగ్గా పాల్గొనాలని ఈ సందర్భంగా మీనాక్షి నటరాజన్.. కొండా సురేఖకు సూచించినట్లు పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిఫార్సు మేరకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించిన సంగతి తెలిసిందే. కేబినెట్ నుంచి తప్పించిన తర్వాత జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలకు సురేఖ గైర్హాజరు కావడం కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో, పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకే ఇన్‌ఛార్జ్ నేరుగా సురేఖతో మాట్లాడినట్లు సమాచారం. ఈ ఫోన్ కాల్ అనంతరం సురేఖ అసెంబ్లీ సమావేశాలకు హాజరవుతారా లేదా అన్నది ఇప్పుడు సర్వత్రా ఆసక్తికరంగా మారింది.






# ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాలు: హైదరాబాద్‌లో 13 రోజుల పాటు ట్రాఫిక్ ఆంక్షలు

- **వినాయక చవితి సందర్భంగా ఖైరతాబాద్‌లో ట్రాఫిక్ ఆంక్షలు**
- **సెప్టెంబర్ 12 నుంచి 24వ తేదీ వరకు ఆంక్షలు అమలు**
- **ప్రతిరోజు ఉదయం 11 గంటల నుంచి రాత్రి వరకు మళ్లింపులు**
- **భక్తుల వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలాల ఏర్పాటు**
- **ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని నగర పోలీసుల సూచన**

హైదరాబాద్‌లో వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో నగర ట్రాఫిక్ పోలీసులు కీలక ప్రకటన విడుదల చేశారు. ప్రసిద్ధ ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, ఈ నెల 12 నుంచి 24వ తేదీ వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు వెల్లడించారు. ఈ 13 రోజుల పాటు రోజూ ఉదయం 11 గంటల నుంచి భక్తుల రద్దీని బట్టి రాత్రి వరకు ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని స్పష్టం చేశారు.

**ప్రధాన మళ్లింపులు ఇవే**

పోలీసులు ప్రకటన ప్రకారం, పాత సైఫాబాద్ పోలీస్ స్టేషన్ నుంచి బడా గణేష్ వైపు వచ్చే వాహనాలను ఇక్బాల్ మినార్ మీదుగా మళ్లిస్తారు. ఇక్బాల్ మినార్ నుంచి ఐమ్యాక్స్ వైపు వెళ్లే వాహనాలు సచివాలయం ఎక్స్ రోడ్ మీదుగా ప్రయాణించాల్సి ఉంటుంది. అదేవిధంగా, నెక్లెస్ రోటరీ నుంచి మింట్ కాంపౌండ్ వైపు వెళ్లే ట్రాఫిక్‌ను సచివాలయం



జంక్షన్, ఖైరతాబాద్ ఫ్లైఓవర్ మీదుగా అనుమతిస్తారు. నిరంకారి నుంచి ఖైరతాబాద్ రైల్వే గేట్ వైపు వచ్చే వాహనాలను పాత సైఫాబాద్ పీఎస్ జంక్షన్ మీదుగా మళ్లిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

**భక్తులకు పార్కింగ్ సౌకర్యాలు:**

గణపతి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేకంగా పార్కింగ్ ప్రదేశాలను కేటాయించారు. రేస్ కోర్స్ రోడ్, ఎన్టీఆర్ ఘాట్, ఐమ్యాక్స్ సమీపంలోని హెచ్‌ఎండీఏ పార్కింగ్ స్థలం, ఐమ్యాక్స్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో వాహనాలను పార్క్ చేసుకోవచ్చు. ఖైరతాబాద్ జంక్షన్ నుంచి వచ్చే భక్తుల కోసం విశ్వేశ్వరయ్య భవన్‌లో పార్కింగ్ ఏర్పాటు చేశారు. వాహనదారులు రద్దీగా ఉండే మార్గాలకు బదులుగా ప్రత్యామ్నాయ రహదారులను ఎంచుకోవాలని పోలీసులు సూచించారు. అత్యవసర సహాయం కోసం 90102 03626 హెల్ప్‌లైన్ నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

# హైదరాబాద్‌లో పరిశ్రమలు నెలకొల్పేందుకు ఐటీ సంస్థల ఆసక్తి: శ్రీధర్‌బాబు

హైదరాబాద్: నగరంలో పరిశ్రమలు నెలకొల్పేందుకు ఐటీ సంస్థల ఆసక్తి చూపుతున్నాయని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో ఐదో రోజు ప్రశ్నోత్తరాల సందర్భంగా సభ్యులు అడిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. ''టైర్ 2 సిటీల్లోని ఐటీ టవర్లలో సంస్థల ఏర్పాటుకు ముందుకు రావట్లేదు. జిల్లాలోని ఐటీ టవర్ల సమీపంలో మౌలిక వసతులపై ఆలోచిస్తున్నారు. ఈ ఏడాదిలో



65 జీసీసీలు తీసుకొచ్చాం. 85 శాతం రెంటల్ స్పేసెస్ జీసీసీలతో నిండిపోయింది. జీసీసీల రాకతో రెండేళ్లలో లక్ష కొత్త ఉద్యోగాలు రానున్నాయి. కొత్త జీసీసీ పాలసీ తీసుకురావడానికి కృషి చేస్తున్నాం. డేటా సెంటర్ల ఏర్పాటుకు రూ.70వేల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చాం. డేటా సెంటర్ల ఏర్పాటుతో ఎన్ని లాభాలున్నాయో.. అన్ని అనర్థాలు కూడా ఉన్నాయి. ఏఐ వచ్చిన తర్వాత ఉపాధి కల్పన తక్కువగా ఉంది'' అని శ్రీధర్‌బాబు వివరించారు.

# అసెంబ్లీకి వెళ్తుంటే యుద్ధ వాతావరణం సృష్టించారు: సబితా ఇంద్రారెడ్డి

దిల్లీ: అసెంబ్లీ ప్రాంగణంలో మహిళా ఎమ్మెల్యేల పట్ల కీచకంగా వ్యవహరించారని బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు దిల్లీలో జాతీయ మానవహక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతిని కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం సబితా ఇంద్రారెడ్డి మీడియాతో మాట్లాడారు. ''అసెంబ్లీ వద్ద మాకు జరిగిన అవమానం చాలా బాధ అనిపించింది. మహిళా ఎమ్మెల్యేల జుట్టు పట్టుకుని లాగుతూ అరాచకం సృష్టించే యత్నం చేశారు. కుట్రలో భాగంగానే ఇదంతా జరిగిందని అర్థమవుతోంది. మమ్మల్ని రక్షించేందుకు మా ఎమ్మెల్యేలు ప్రయత్నించారు. ఎమ్మెల్యేలను తోసేస్తే కిందపడిపోగా.. వాళ్లను కూడా తొక్కేశారు. జగదీశ్‌రెడ్డి బీపీ పెరిగి ఆరోగ్య సమస్యలు ఎదుర్కొన్నారు. చాలా మంది శాసనసభ్యులకు దెబ్బలు తగిలాయి. బాధ్యులపై చర్య తీసుకోవాలని మూడు రోజులుగా అడుగుతుంటే అరణ్యరోదనే అవుతోంది. మమ్మల్ని అసెంబ్లీలోకి వెళ్లకుండా అడ్డుకునే అధికారం ఎవరిచ్చారు. ఎవరు ఆదేశాలు ఇస్తే ఆపారని అడుగుతుంటే సమాధానం లేదు. అసెంబ్లీలో మా వాదన వినడానికి కూడా సిద్ధంగా లేరు. మహిళా ఎమ్మెల్యేలపై దాడి ఘటనపై డీజీపీ ఆఫీసులో ఫిర్యాదు చేసినా ఎవరూ స్పందించలేదు''



సబితా ఇంద్రారెడ్డి వివరించారు.

# జీహెచ్‌ఎంసీకి యాడ్ ఏజెన్సీల బకాయిల చిట్టా.. టాప్ డిఫాల్టర్లు వీళ్లే!

- **జీహెచ్‌ఎంసీకి యాడ్ ఏజెన్సీల భారీ బకాయి**
- **సుమారు రూ. 39.74 కోట్లు చెల్లించాల్సి ఉన్నట్టు వెల్లడి**
- **శాసనమండలిలో ఎమ్మెల్సీ ప్రశ్నకు ప్రభుత్వం సమాధానం**
- **బకాయిదారుల జాబితాలో పలు ప్రముఖ ఏజెన్సీల పేర్లు**
- **యూనియాడ్స్ నుంచే అత్యధికంగా రూ. 7.71 కోట్ల బకాయి**

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) పరిధిలోని అవుట్‌డోర్ అడ్వర్టైజింగ్ ఏజెన్సీలు భారీగా బకాయిలు పడ్డాయి. ఈ ఏజెన్సీల నుంచి జీహెచ్‌ఎంసీకి సుమారు రూ. 39.74 కోట్లు (ఖచ్చితంగా రూ. 39,74,15,778) రావాల్సి ఉందని తెలంగాణ ప్రభుత్వం వెల్లడించింది. ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్ కుమార్ అడిగిన



ప్రశ్నకు సమాధానంగా, పురపాలకపట్టణాభివృద్ధి శాఖ సెప్టెంబరు 10న శాసనమండలిలో ఈ వివరాలను సమర్పించింది. ప్రభుత్వం అందించిన నివేదిక ప్రకారం.. హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో మొత్తం 452 ఏజెన్సీ ఎంట్రీలు, 1,521 అడ్వర్టైజ్‌మెంట్ యూనిట్లకు సంబంధించి ఈ బకాయిలు పేరుకుపోయాయి. బకాయిదారుల జాబితాలో పలు ప్రముఖ సంస్థలు ఉన్నాయి. ముఖ్యంగా, యూనియాడ్స్ అనే సంస్థ ఒక్క యూనిట్‌కే అత్యధికంగా రూ. 7.71 కోట్లు చెల్లించాల్సి ఉండగా, ఐ క్యాచ్ కమ్యూనికేషన్స్ మరో యూనిట్‌కు సంబంధించి రూ. 6.47 కోట్లు బకాయిపడింది. అత్యధిక యూనిట్లు కలిగిన సంస్థల్లో ప్రకాశ్ ఆర్ట్స్ ముందు వరుసలో ఉంది. ఈ సంస్థకు చెందిన 53 యూనిట్లకు గానూ మొత్తం రూ. 5.35 కోట్లు బకాయిలు ఉన్నాయి. వీటితో పాటు మీడియా కార్ప్ రూ. 5.06 కోట్లు, సీఎంఎస్‌ఎస్ రూ. 1.79 కోట్లు, అవుట్‌స్పేస్ అడ్వర్టైజింగ్ రూ. 1.86 కోట్ల చొప్పున బకాయిలు చెల్లించాల్సి ఉంది. అవుట్‌డోర్ ప్రకటనల నియంత్రణ కోసం ప్రభుత్వం ఈ ఏడాది మార్చి, జూన్ నెలల్లో 'అవుట్‌డోర్ అడ్వర్టైజ్‌మెంట్ పాలసీ ఫర్ క్యూర్ 2026'ను జారీ చేసింది. దీని ప్రకారం.. ప్రైవేట్ ఆస్తులపై ప్రదర్శించే ప్రకటనలకు ఆన్‌లైన్ ద్వారా, ప్రభుత్వ ఆస్తులపై ప్రకటనలకు టెండర్ల ద్వారా అనుమతులు మంజూరు చేస్తారు. అయితే, ఫీజుల వసూలుకు సంబంధించి 2020 నాటి మార్గదర్శకాలు ప్రస్తుతం నిలిపివేతలో ఉన్నాయని, త్వరలోనే సమగ్రమైన కొత్త విధానాన్ని తీసుకురానున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.

# ఓటర్ల జాబితా సవరణ: సమంత, విజయ్ దేవరకొండ, వీవీఎస్ లక్ష్మణ్ సహా ప్రముఖులకు నోటీసులు

- **ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణలో భాగంగా పలువురు ప్రముఖులకు ఈసీ నోటీసులు**
- **హైదరాబాద్‌లో సమంత, విజయ్ దేవరకొండ, మహేశ్ బాబు, రాజమౌళి తదితరులు**
- **పేర్లలో తప్పులు, పాత రికార్డులతో వివరాలు సరిపోలకపోవడమే కారణం**
- **ఇది కేవలం పరిశీలనకేనని, ఓటు హక్కు రద్దు కాదని అధికారుల స్పష్టత**

కేంద్ర ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన పలువురు సినీ, క్రీడా రంగాల ప్రముఖులకు నోటీసులు జారీ అయినట్లు తెలుస్తోంది. వీరిలో హీరోయిన్ సమంత, హీరో విజయ్ దేవరకొండ, మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ వంటి వారు ఉన్నట్లు సమాచారం. ఓటర్ల జాబితాలోని వివరాల పరిశీలన నిమిత్తమే ఈ నోటీసులు జారీ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ జాబితాలో నటుడు మహేశ్ బాబు, ఆయన భార్య నమ్రత, ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి, నటుడు వెంకటేశ్, ఆయన కుమార్తెలు, నటుడు ఆనంద్ దేవరకొండలతో పాటు క్రీడాకారులు సైనా నెహ్వాల్, మిథాలీ రాజ్, పుల్లెల గోపీచంద్ కూడా ఉన్నట్లు సమాచారం.




ఫార్మా దిగ్గజం మురళీ కృష్ణ ప్రసాద్ దివి, మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ సతీమణి ఉపాసన కొణిదెల పేర్లు కూడా ఈ జాబితాలో ఉన్నట్లు తెలుస్తోంది. ఓటర్ల పేర్లు లేదా వారి తల్లిదండ్రుల పేర్లలో వ్యత్యాసాలు ఉండటం, పాత రికార్డులతో ప్రస్తుత వివరాలు సరిపోలకపోవడం వంటి కారణాలతో ఈ నోటీసులు పంపినట్లు అధికారులు పేర్కొంటున్నారు. కొన్ని సందర్భాల్లో నిర్దిష్టమైన కారణం ఏదీ పేర్కొనలేదని కూడా వార్తలు వస్తున్నాయి. నోటీసులు అందుకున్న వారు నేరుగా హాజరై తమ వివరాలను సరిచూసుకోవచ్చని లేదా అవసరమైన పత్రాలను సమర్పించి పొరపాట్లను సరిదిద్దుకోవచ్చని ఎన్నికల అధికారులు సూచిస్తున్నారు. ఒకవేళ వ్యక్తిగతంగా హాజరు కాలేని పక్షంలో తమ తరఫున ప్రతినిధులను పంపేందుకు కూడా అవకాశం కల్పించారు. అయితే, నోటీసు జారీ అయినంత మాత్రాన ఓటు హక్కు రద్దయినట్లు కాదని, ఇది కేవలం ధ్రువీకరణ ప్రక్రియలో ఒక భాగం మాత్రమేనని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ ప్రత్యేక సవరణ ప్రక్రియ దేశవ్యాప్తంగా సాగుతోంది. కర్ణాటకలోనూ ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని, జెరోధా వ్యవస్థాపకులు నితిన్, నిఖిల్ కామత్‌లకు కూడా ఇటువంటి నోటీసులే అందాయి. ఇదే క్రమంలో ప్రముఖ శాస్త్రవేత్త, భారతరత్న సీఎన్ఆర్ రావుకు కూడా నోటీసు జారీ అయిందన్న వార్తలను ఎన్నికల సంఘం ఖండించింది.



# పుతిన్‌కు కానుకగా 'తిరుక్కురళ్'.. ఏమిటేది?

బ్రిక్స్ కూటమి శిఖరాగ్ర సదస్సు కోసం భారత్‌కు విచ్చేసిన రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ప్రధాని మోదీ భేటీ అయ్యారు. భారత్ మండపానికి చేరుకున్న పుతిన్‌కు స్వాగతం పలికిన మోదీ.. ఓ పుస్తకాన్ని కానుకగా అందించారు. అదే ప్రముఖ కవి తిరువళ్లూర్ రచనా గ్రంథం తిరుక్కురళ్. రష్యన్ భాషలోకి అనువదించిన ప్రతిని పుతిన్‌కు మోదీ అందజేశారు.

**ఏమిటీ తిరుక్కురళ్..?**

ప్రాచీన తమిళ సాహిత్యంలో అత్యంత ప్రసిద్ధి చెందిన రచనలలో తిరుక్కురళ్ ఒకటి. ఇందులో నైతికత, ప్రేమ, మంచితనం, సుపరిపాలన, సంపద, మనిషి ప్రవర్తన వంటి అనేక రకాల అంశాలతో కూడిన 1330 ద్విపదలు ఉన్నాయి. దీనిని మొత్తం 133 అధ్యాయాలుగా విభజించగా.. ఒక్కోదాంట్లో పది ద్విపదలు ఉన్నాయి. ఓ వ్యక్తి ప్రవర్తన ఎలా ఉండాలి? ఇతరులతో ఎలా వ్యవహరించాలి? అనే విషయాలు మొదలుకొని.. జీవితం, మరణం, వాటిమధ్య ఇమిడి ఉన్న అనేక విషయాలను ఇందులో ప్రస్తావించారు. మొత్తంగా మానవ అస్తిత్వానికి సంబంధించిన ప్రశ్నలను లేవనెత్తుతూ నీతి వాక్యాలు రాశారు. కేవలం ఇవే కాకుండా పాలకులు, న్యాయం, వ్యవసాయం, పన్నులు, ప్రభుత్వాల గురించి పేర్కొన్నారు. దాదాపు 2వేల నుంచి రెండున్నర వేల సంవత్సరాల క్రితం తిరువళ్లూర్ రాసినట్లుగా భావించే ఈ అమూల్య గ్రంథాన్ని అర్థవంతమైన, నైతిక జీవితాన్ని గడపడానికి ఓ మార్గదర్శిగా అభివర్ణిస్తుంటారు. సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్లాసికల్ తమిళ్ ప్రచురించిన ఈ రష్యన్ అనువాద గ్రంథాన్నే పుతిన్‌కు మోదీ అందించడం విశేషం.

# రెండు వాణిజ్య నౌకలు ఢీ..
# గుజరాత్ తీరంలో ఘటన



గుజరాత్ తీరంలో రెండు వాణిజ్య నౌకలు ఢీకొన్నాయి. కాండ్లా నౌకాశ్రయానికి సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. వెంటనే రంగంలోకి దిగిన భారత కోస్ట్ గార్డ్.. రెస్క్యూ ఆపరేషన్ చేపట్టింది. ఓ నౌకలో 24 మంది సిబ్బంది ఉండగా.. వారిలో 21 మందిని సురక్షితంగా తరలించినట్లు వెల్లడించింది. నౌక కార్యకలాపాలు కొనసాగించేందుకు ముగ్గురు సిబ్బంది అందులోనే ఉన్నారని తెలిపింది. ఎంవీ కేమ్యాక్స్ ఎంపరర్, ఎంవీ ట్రూ మారినర్ అనే వాణిజ్య నౌకలు ఢీకొన్నాయని పేర్కొంది. ఈ ఘటన నేపథ్యంలో కాలుష్య ప్రతిస్పందన చర్యలు మొదలుపెట్టామని.. సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటున్నట్లు తెలిపింది.

# కొల్హాపూర్ వెళ్లినా 'మాధురి' బాధ్యత కొనసాగుతుంది: వంతారా

జామ్‌నగర్: కొల్హాపూర్‌లో అందరూ 'మహాదేవి'గా పిలుచుకునే మాధురి అనే ఏనుగు పట్ల తమ బాధ్యత మున్ముందు కొనసాగుతుందని వంతారా సంరక్షణ కేంద్రం స్పష్టంచేసింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలతో ఏర్పాటైన ఉన్నత స్థాయి కమిటీ ఆదేశాల మేరకు మాధురి తిరిగి కొల్హాపూర్‌కు వెళుతున్న నేపథ్యంలో ఓ ప్రకటన విడుదల చేసింది. మాధురి వంతారా వీడినా దాని సంక్షేమ బాధ్యతను విస్మరించబోమని స్పష్టంచేసింది. కొల్హాపూర్‌లోని నందని గ్రామంలోని జైనమఠంలో దాదాపు 33 ఏళ్ల పాటు సేవలందించిన 'మాధురి'ని 2025 జులై 30న కోర్టు ఆదేశాల మేరకు జామ్‌నగర్‌లోని వంతారాకు తరలించారు. అయితే, భాగస్వామ్యపక్షాల వాదనలు విన్న ఉన్నత స్థాయి కమిటీ.. మాధురిని తిరిగి కొల్హాపూర్‌కు తరలించేందుకు అనుమతించింది. ఊరేగింపులకు లేదా మరే ఇతర ప్రయోజనాలకు ఏనుగును ఉపయోగించకూడదని స్పష్టంచేసింది. దానికి నిరంతర సంరక్షణ అందించాలని సూచించింది. ప్రతి 15 రోజులకోసారి వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించింది. ఈ ఆదేశాలను తాము గౌరవిస్తామని వంతారా ఓ ప్రకటనలో స్పష్టంచేసింది. వంతారా సంరక్షణ కేంద్రంలో నిరంతర వైద్య సంరక్షణ వల్ల మాధురి ఆరోగ్యం మెరుగైందని, దీర్ఘకాలిక సమస్యలు మాత్రం



ఇంకా కొనసాగుతున్నాయని వంతారా ఈ సందర్భంగా పేర్కొంది. ఇప్పటికీ వైద్య పర్యవేక్షణ అవసరమని అభిప్రాయపడింది. మాధురి కొల్హాపూర్‌కు తిరిగి వెళ్లినంత మాత్రాన వంతారా బాధ్యత ముగిసిపోదని తెలిపింది. దాని ఆరోగ్యం మెరుగుపడే వరకు వంతారాకు చెందిన పశువైద్యులు ప్రతి 15 రోజులకు ఒకసారి కొల్హాపూర్‌కు వెళ్లి మాధురికి వైద్య పరీక్షలు నిర్వహించి, అధికారులకు నివేదికలు సమర్పిస్తారని స్పష్టం చేసింది. కోర్టు లేదా అధికారులు ఆదేశిస్తే కొల్హాపూర్‌లో మాధురి కోసం సదుపాయాల మెరుగుకూ తోడ్పాటు అందిస్తామని వంతారా తెలిపింది. మాధురి ఎక్కడ ఉన్నా దాని శ్రేయస్సే ప్రాధాన్యమని పునరుద్ఘాటించింది.

# ముర్ము, మోదీలను కలిసిన ఆగాఖాన్

దిల్లీ: ఇస్మాయిలీ ముస్లింల 50వ ఇమామ్ అయిన ప్రిన్స్ రహీమ్ ఆగాఖాన్5 గురువారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును, ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌ను, ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు. ఉపరాష్ట్రపతి ఆహ్వానం మేరకు ఆయన ఈ నెల 9 భారత పర్యటనకు వచ్చారు. ఆయన పర్యటన 15వ తేదీ వరకూ కొనసాగుతుంది. "ప్రిన్స్ రహీమ్ ఆగాఖాన్ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును ఆమె అధికార నివాసంలో కలిశారు" అని రాష్ట్రపతి కార్యాలయం తన ఎక్స్ పోస్టులో పేర్కొంది. ఆగాఖాన్ డెవలప్‌మెంట్ నెట్‌వర్క్ చేపట్టిన దాతృత్వ కార్యకలాపాలను రాష్ట్రపతి ఈ సందర్భంగా కొనియాడారు. "ప్రిన్స్ రహీమ్ ఆగాఖాన్5ను కలవడం ఎంతో ఆనందాన్నిచ్చింది. సమాలోచనల సందర్భంగా ఆయన దివంగత తండ్రిని జ్ఞాపకం చేసుకున్నా. ఆరోగ్యం, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, యువ, మహిళా సాధికారికత రంగాల్లో ఆగాఖాన్ డెవలప్‌మెంట్ నెట్‌వర్క్‌తో ఏ విధంగా కలిసి పని చేయాలన్న



అంశంపై మా మధ్య చర్చ జరిగింది" అని ప్రధాని తన ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. తన పర్యటనలో భాగంగా ప్రిన్స్ రహీమ్ ఆగాఖాన్ అహ్మదాబాద్, ముంబయి, హైదరాబాద్ నగరాల్లో పర్యటిస్తారని ఒక అధికారిక ప్రకటన తెలిపింది. ఇస్మాయిలీ ముస్లింల 50వ ఇమామ్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన భారత పర్యటనకు రావడం ఇదే ప్రథమం.

# కాంగ్రెస్‌తో 'వందేమాతరం' వివాదం.. స్పందించిన ఒమర్ అబ్దుల్లా

శ్రీనగర్‌లో ఇటీవల జరిగిన అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో జాతీయ గేయం 'వందేమాతరం'ను పూర్తిగా ఆలపించే విషయంలో కాంగ్రెస్ (Congress), నేషనల్ కాన్ఫరెన్స్ మధ్య మాటల యుద్ధం జరిగింది. ఈ విషయంపై తాజాగా జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా స్పందించారు. 'జాతీయ గేయానికి సంబంధించి ఇటీవల చట్టం చేసిన విషయం తెలిసిందే. అందులో అన్ని చరణాలు పాడడాన్ని తప్పనిసరి చేశారు. ఇది కేవలం జమ్మూకశ్మీర్‌కే కాదు. యావత్ దేశానికి వర్తిస్తుంది. ఈ నిబంధనలు పాటించకపోతే చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. మా పార్టీ భావజాలానికి..



వందేమాతరానికి సంబంధం లేదు. అయినప్పటికీ దేశంలోని చట్టాలను మేం పాటిస్తాం. అలా కాకుండా చట్టాన్ని ఎదిరించి.. కశ్మీరీలు జైలులో ఉండాలని కాంగ్రెస్ కోరుకుంటోందా?' అని ఒమర్ అబ్దుల్లా ప్రశ్నించారు.

**అసలేమయ్యిందంటే..?**

శ్రీనగర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పూర్తి వందేమాతరం ఆలపించే వరకు ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా సహా అందరూ నిల్చొనే ఉన్నారు. పూర్తి వందేమాతరాన్ని ఆలపించడంపై కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. దీనిపై నేషనల్ కాన్ఫరెన్స్ స్పందిస్తూ.. ఇండియా కూటమి భాగస్వామిగా తమ మిత్రపక్షాలపై షరతులు విధించే అధికారం కాంగ్రెస్‌కు లేదని స్పష్టం చేసింది. దీంతో ఇరుపార్టీల మధ్య ఈ అంశం వివాదంగా మారింది.

# ఐసీసీ నుంచి వైదొలగండి..
# నాటో దేశాలకు అమెరికా సూచన

- ఐసీసీ నుంచి తప్పుకోవాలని నాటో దేశాలపై అమెరికా ఒత్తిడి
- బ్రసెల్స్‌లో జరిగిన రహస్య భేటీలో అమెరికా డిమాండ్
- అమెరికా పిలుపును తిరస్కరించిన ఫ్రాన్స్, నెదర్లాండ్స్
- తమ సార్వభౌమాధికారానికి ఐసీసీ ముప్పు అని ఆరోపణ

అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసీసీ) నుంచి వైదొలగాలని అమెరికా తన నాటో మిత్రదేశాలను కోరింది. ఈ ఏడాది జులైలో బ్రసెల్స్‌లో 32 నాటో దేశాల రాయబారులతో రహస్యంగా నిర్వహించిన సమావేశంలో అమెరికా ఈ డిమాండ్‌ను తెరపైకి తెచ్చినట్లు తాజాగా వెల్లడైంది. అమెరికా రాయబారి మాథ్యూ జార్జ్ ఈ సమావేశంలో మాట్లాడుతూ, ఐసీసీ వల్ల మిత్రదేశాలకు ఎదురయ్యే ముప్పును విశ్లేషించాలని, ఆ సంస్థకు మద్దతును నిలిపివేయాలని కోరారు. ఐసీసీ చర్యలను విమర్శిస్తూ, ఈ ధోరణికి ముగింపు పలకాలని ఆయన సూచించారు. ఐసీసీ ప్రాధాన్యతను క్రమంగా తగ్గించేందుకు అమెరికా ప్రణాళికలు రచిస్తోందని, తమ ప్రతిపాదనకు ఏయే దేశాలు మద్దతుగా నిలుస్తాయనే విషయాన్ని వాషింగ్టన్ నిశితంగా గమనిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, అమెరికా పిలుపును ఫ్రాన్స్, నెదర్లాండ్స్ వంటి దేశాలు వ్యతిరేకించాయి. తాము ఐసీసీకి మద్దతుగా నిలుస్తామని ఆ దేశాలు బహిరంగంగానే ప్రకటించాయి. మరోవైపు, అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో మాట్లాడుతూ, ఐసీసీ మద్దతుదారులు అంతర్జాతీయ చట్టాలను దుర్వినియోగం చేస్తూ ఇతర దేశాల సార్వభౌమాధికారంలో జోక్యం చేసుకుంటున్నారని ఆరోపించారు. తమ అధికార పరిధిని పరిమితం చేసే ప్రయత్నాలు జరిగితే తీవ్రంగా స్పందిస్తామని ఆయన హెచ్చరించారు. నరమేధం, యుద్ధ నేరాల వంటి తీవ్రమైన అంతర్జాతీయ నేరాలకు పాల్పడిన వ్యక్తులను విచారించేందుకు 2002లో ఐసీసీని స్థాపించారు. నాటో కూటమికి ఈ కోర్టులో నేరుగా సభ్యత్వం లేకపోయినప్పటికీ, అమెరికా, టర్కీ మినహా మిగిలిన అన్ని నాటో సభ్యదేశాలు ఇందులో భాగస్వాములుగా కొనసాగుతున్నాయి.

# ఢిల్లీ నుంచి అగ్రదేశాలకు పుతిన్ సవాల్.. 'బ్రిక్స్' బలమెంతో చెప్పిన రష్యా అధ్యక్షుడు!

- **ఎన్జీటీ నోటీసులు: మూసీ ప్రాజెక్టుకు ఎదురుదెబ్బ**
- **ఎడారిలో కొత్త నగరం: 6,000 ఇళ్లతో 'మాన్యుమెంట్ హిల్స్'**
- **ప్రపంచ జీడీపీలో బ్రిక్స్ వాటా 40 శాతానికి పైగా ఉందన్న పుతిన్**
- **జీ7 వాటా 29 శాతమేనని వెల్లడి**
- **ఐదేళ్ల ప్రపంచ వృద్ధిలో బ్రిక్స్ వాటా సగానికి పైగానే ఉందని వెల్లడి**
- **జీ7 వృద్ధి వాటా 18 శాతంగా ఉందని ప్రస్తావన**
- **బ్రిక్స్ కోసం కొత్త పెట్టుబడి వేదిక ఏర్పాటుకు పుతిన్ ప్రతిపాదన**

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో బ్రిక్స్ దేశాల ప్రాధాన్యం వేగంగా పెరుగుతోందని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అన్నారు. ప్రపంచ జీడీపీలో బ్రిక్స్ దేశాల వాటా 40 శాతానికి పైగా ఉందని చెప్పారు. జీ7 దేశాల వాటా 29 శాతమేనని తెలిపారు. న్యూఢిల్లీలో శుక్రవారం జరిగిన 'బ్రిక్స్ బిజినెస్ ఫోరం'లో పుతిన్ మాట్లాడారు. గత ఐదేళ్ల గణాంకాలను ఆయన ప్రస్తావించారు. ప్రపంచ ఆర్థిక వృద్ధిలో సగానికి పైగా బ్రిక్స్ దేశాల నుంచే వచ్చిందన్నారు. అదే సమయంలో జీ7 దేశాల వాటా 18 శాతంగా ఉందని చెప్పారు. బ్రిక్స్ ఎదుగుదలను పాశ్చాత్య దేశాలు గమనిస్తున్నాయని పుతిన్ అన్నారు. తమ పోటీ సామర్థ్యాన్ని పెంచుకునేందుకు అవి ప్రయత్నిస్తున్నాయని చెప్పారు. ఈ పోటీ కొన్ని సందర్భాల్లో అసహ్యకర స్థాయికి చేరుతోందని వ్యాఖ్యానించారు. బ్రిక్స్ దేశాల కోసం కొత్త పెట్టుబడి వేదికను ఏర్పాటు చేయాలని పుతిన్ ప్రతిపాదించారు. న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ ద్వారా దీనిని ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రైవేటు రంగం నుంచి పెట్టుబడులు సమీకరించేందుకు ఇది ఉపయోగపడుతుందని చెప్పారు. బ్రిక్స్ దేశాలకు



భారీ దేశీయ మార్కెట్లు ఉన్నాయని పుతిన్ తెలిపారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ప్రస్తుతం లోతైన మార్పులు జరుగుతున్నాయని చెప్పారు. కొత్త వృద్ధి కేంద్రాలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. రష్యాపై 30 వేలకు పైగా ఆంక్షలు ఉన్నాయని పుతిన్ వెల్లడించారు. ప్రపంచం మార్పుల దశలో ఉందని చెప్పారు. ఈ మార్పులు మానవాళి భవిష్యత్తుకు అవసరమని పేర్కొన్నారు.

# టీమిండియాలో గాయాల బెడద.. కీలక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానించిన బీసీసీఐ

- **స్పోర్ట్స్ సైన్స్ హెడ్ పోస్టుకు మళ్లీ దరఖాస్తులు ఆహ్వానించిన బీసీసీఐ**
- **బెంగళూరు సీవోఈలో కీలక బాధ్యతలు**
- **2025 మార్చి నుంచి ఖాళీగా ఉన్న పోస్టు**
- **నితిన్ పటేల్ తర్వాత భర్తీ కాని స్థానం**
- **ఆటగాళ్ల గాయాలు, ఫిట్‌నెస్‌పై పర్యవేక్షణ**



భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) మరో కీలక పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానించింది. బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ)లో 'హెడ్‌స్పోర్ట్స్ సైన్స్ అండ్ మెడిసిన్' పదవికి మళ్లీ దరఖాస్తులు కోరుతోంది. ఈ పోస్టును గతేడాది సెప్టెంబర్‌లోనూ భర్తీ చేసేందుకు ప్రయత్నించినా.. సరైన అభ్యర్థి దొరకకపోవడంతో ప్రక్రియ పూర్తికాలేదు. ఈ పదవి 2025 మార్చి తర్వాత ఖాళీగా ఉంది. దాదాపు మూడేళ్లు సీవోఈలో సేవలందించిన మాజీ టీమిండియా ఫిజియో నితిన్ పటేల్ బాధ్యతల నుంచి తప్పుకోవడంతో ఈ ఖాళీ ఏర్పడింది. 2023 వన్డే ప్రపంచకప్ ముందు జస్‌ప్రీత్ బుమ్రా, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్, మహ్మద్ షమీల రికవరీలో పటేల్ కీలక పాత్ర పోషించారు. కొత్తగా ఎంపికయ్యే వ్యక్తి బీసీసీఐ స్పోర్ట్స్ సైన్స్, మెడిసిన్ విభాగానికి వ్యూహాత్మక, నిర్వహణపరమైన నాయకత్వం వహించాలి. జాతీయ జట్టు ఫిజియోలు, స్ట్రెంత్ అండ్ కండిషనింగ్ నిపుణులతో పాటు సీవోఈలోని వైద్య సిబ్బందిని పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఆటగాళ్ల గాయాల నివారణ, చికిత్స, పునరావాసం, ఫిట్‌నెస్, శారీరక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. కొత్త వైద్య విధానాలు, పరిశోధనలు, సాంకేతికతను ఉపయోగించడం కూడా ఈ పోస్టులో కీలక బాధ్యతలుగా బీసీసీఐ పేర్కొంది. ఆటగాళ్ల ఆరోగ్యం, దీర్ఘకాలిక ఫిట్‌నెస్, గాయాల ముప్పు తగ్గించడం వంటి అంశాలపై వ్యూహాలను రూపొందించాల్సి ఉంటుంది. ఈ పోస్టుకు స్పోర్ట్స్ సైన్స్ లేదా సంబంధిత విభాగంలో మాస్టర్స్ డిగ్రీ తప్పనిసరి. డాక్టరేట్ ఉంటే అదనపు అర్హతగా పరిగణిస్తారు. ప్రొఫెషనల్ లేదా ఒలింపిక్ క్రీడల్లో బృందాలకు నాయకత్వం వహించిన కనీసం ఐదేళ్ల అనుభవం ఉండాలి. అభ్యర్థి వయసు 60 ఏళ్లలోపు ఉండాలి. ఎంపికైన వ్యక్తి సీవోఈలో హెడ్ ఆఫ్ క్రికెట్‌గా ఉన్న మాజీ భారత బ్యాటర్ వీవీఎస్ లక్ష్మణ్‌కు రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. ఆసక్తి ఉన్నవారు సెప్టెంబర్ 30 సాయంత్రం 5 గంటల్లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. షార్ట్‌లిస్ట్ అయిన అభ్యర్థులను వ్యక్తిగత ఇంటర్వ్యూకు పిలుస్తారు. ఈ పోస్టు భర్తీ విషయంలో తొందరపడబోమని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ఇటీవలే చెప్పారు. సీవోఈలో ప్రస్తుతం సుమారు 16 మంది ఫిట్‌నెస్, రిహాబిలిటేషన్ సేవలు అందిస్తున్నారని.. అయితే వారందరినీ పర్యవేక్షించేందుకు సరైన నిపుణుడు అవసరమని తెలిపారు. అలాంటి నిపుణులు భారత్‌లోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా చాలా తక్కువ సంఖ్యలో ఉన్నారని ఆయన పేర్కొన్నారు.

# బ్రిక్స్‌కు పెరుగుతున్న క్రేజ్.. ఈసారి ఎందుకంత స్పెషల్?

బ్రిక్స్.. ఇందులో చేరేందుకు 30 దేశాలు క్యూలో ఉన్నాయంటేనే అర్థం చేసుకోవచ్చు.. ఏటికేడు ప్రపంచంలో ఈ గ్రూప్‌నకు హైప్ పెరుగుతోంది అని. 2009లో ఐదు దేశాలతో ప్రారంభమైన ఈ గ్రూప్‌లో ప్రస్తుతం 11 దేశాలు ఉన్నాయి. ఈ నెల 12, 13 తేదీల్లో జరగనున్న 18వ బ్రిక్స్ సదస్సుకు భారత్‌ఆతిథ్యం ఇవ్వనున్న నేపథ్యంలో బ్రిక్స్ ఎందుకింత స్పెషల్? భారత్ బ్రిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వడం, వేరే దేశం హోస్ట్ చేసినప్పుడు హాజరయ్యేందుకు మధ్య తేడా ఉందా?.. మనకేమైనా బెనిఫిట్స్ ఉంటాయా? తదితర అంశాలను ఈ వీడియోలో తెలుసుకుందాం




# యాపిల్ రేట్ల దెబ్బకు.. ఐఫోన్ల విక్రయాలు తగ్గొచ్చు..!

యాపిల్ తన కొత్త మోడల్ 'ఐఫోన్ 18'ను విడుదల చేసిన వెంటనే భారత్‌లో పాత ఐఫోన్ల ధరలు భారీగా పెంచేసింది. మరోవైపు, కొత్తగా విడుదల చేసిన ఫోల్డబుల్ ఫోన్‌తో పాటు ఐఫోన్ 18 శ్రేణి ధరలు కూడా విపరీతంగా ఉన్నాయి. దీనిపై ఇప్పటికే నెట్టింట సెటైర్లు పేలుతున్నాయి. అయితే, ఈ ధరల ప్రభావం దేశీయంగా ఐఫోన్ విక్రయాలపై ప్రతికూల ప్రభావం చూపొచ్చని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. 2026 క్యాలెండర్ సంవత్సరంలో భారత్‌లో ఐఫోన్ విక్రయాలు కాస్త తగ్గే అవకాశం ఉందని మార్కెట్ రీసెర్చర్స్ ఐడీసీ ఇండియా, కౌంటర్‌పాయింట్ అంచనా వేశాయి. దేశీయంగా ఈ విక్రయాల్లో



తొలిసారి క్షీణత నమోదవ్వొచ్చని పేర్కొన్నాయి. అయితే, అమ్మకాల విలువ పరంగా చూస్తే మాత్రం.. 67శాతం వృద్ధి ఉండొచ్చని అంచనా వేశాయి. మరోవైపు, ఐఫోన్ల ధరల పెంపు వల్ల గ్రే మార్కెట్ విక్రయాలు, వ్యక్తిగత దిగుమతులు పెరిగే అవకాశం ఉందని ఆల్ ఇండియా మొబైల్ రిటైలర్స్ అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. దీనివల్ల రిటైల్ మార్కెట్ దెబ్బతిని, వ్యాపారులు నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొంది. యాపిల్ కొత్తగా విడుదల చేసిన ఐఫోన్ 18 శ్రేణి ధర రూ.1,64,900 నుంచి మొదలైన సంగతి తెలిసిందే. మడతపెట్టే ఐఫోన్ డ్యూయో ప్రారంభ ధర రూ.2,99,900గా ఉంది. ఇక, ఐఫోన్ 17, ఐఫోన్ ఎయిర్, ఐఫోన్ 16 ధరలను కూడా యాపిల్ భారీగా పెంచేసింది. ఇతర దేశాల మార్కెట్లతో పోలిస్తే భారత్‌లో వీటి ధరలు దాదాపు 1015శాతం అధికంగా ఉండటం గమనార్హం.



# ఏడాదిలోనే 50% పెరిగిన రాగి ధర

*** టన్ను రూ.14 లక్షలకు చేరిక**

ప్రపంచవ్యాప్తంగా రాగి తవ్వకం, శుద్ధి సామర్థ్యాల (స్మెల్టింగ్) మధ్య పెరుగుతున్న అసమతుల్యత వల్ల.. సరఫరా ఒతిళ్లు పెరిగి, రాగి ధరలు రికార్డు స్థాయికి చేరాయని ఇండియన్ ప్రైమరీ కాపర్ ప్రొడ్యూసర్ అసోసియేషన్ (ఐపీసీపీఏ) తెలిపింది. లండన్ మెటల్ ఎక్స్ఛేంజీలో రాగి ధర టన్ను 14,737 డాలర్ల (రూ.14 లక్షల)కు చేరింది. ఇది గతేడాది సెప్టెంబరుతో పోలిస్తే 50% ఎక్కువ. అమెరికా సుంకాలు విధించొచ్చనే అంచనాలు, గనుల నుంచి సరఫరా తగ్గడం, ప్రపంచ నిల్వల్లో తీవ్రమైన మార్పుల వల్ల మార్కెట్ స్వరూపం మారుతుండటం ఇందుకు కారణమని ఐపీసీపీఏ పేర్కొంది. కామెక్స్, ఎల్ఎంఈ మార్కెట్ల మధ్య ఉన్న ధరల వ్యత్యాసాన్ని అనుకూలంగా మల్చుకునేందుకు.. ఈ ఏడాది ప్రారంభం నుంచి లక్షల టన్నుల రాగి అమెరికాకు రవాణా అయినట్లు తెలిపింది.

* కామెక్స్: న్యూయార్క్ కేంద్రంగా పనిచేసే కమొడిటీ ఎక్స్ఛేంజ్ ఇది. బంగారం, వెండి, రాగి వంటి లోహాల ఫ్యూచర్స్‌ఆప్షన్స్ ట్రేడింగ్ చేస్తుంటుంది. సరకు డెలివరీ తక్కువ. హెడ్జింగ్ కార్యకలాపాలు ఎక్కువ.
* ఎల్ఎంఈ: లండన్ కేంద్రంగా కార్యకలాపాలు సాగించే లండన్ మెటల్ ఎక్స్ఛేంజ్ ఇది. రాగి, అల్యూమినియం, జింక్, నికెల్ వంటి పారిశ్రామిక ప్రాథమిక లోహాలకు వాస్తవ విపణి ఆధారంగా ధరలను ప్రకటిస్తుంటుంది.
* అమెరికా సుంకాల ప్రభావం: ఈ రెండు ఎక్స్ఛేంజీల ధరలు సాధారణంగా సమీపంలోనే ఉంటాయి. అయితే అమెరికా టారిఫ్‌లు విధించినప్పుడు, సరఫరా అంతరాయాల వల్ల ఈ లోహాల ధరల్లో వ్యత్యాసం ఏర్పడితే, అందుకనుగుణంగా లాభం పొందడానికి సరకును వివిధ దేశాల మధ్య తరలిస్తుంటారు.

రాగి దిగుమతుల మీద విధించే సుంకాలపై అమెరికా వాణిజ్య శాఖ నివేదిక వెలువడటానికి దాదాపు రెండు నెలలు ఆలస్యమైనప్పటికీ.. ఆంక్షలు విధించే అవకాశం ఉందన్న అంశాన్ని మార్కెట్ పరిగణనలోకి తీసుకుంటుందని, ధరలు పెరిగేందుకు ఇది దారి తీస్తుందని పేర్కొంది. కామెక్స్ నిల్వలు రికార్డు స్థాయిలో 6,75,000 టన్నులకు పెరగ్గా, ఎంఎల్ఈ గిడ్డంగుల్లో నిల్వలు అత్యంత కనిష్ఠ స్థాయికి పడిపోయాయని, దీనివల్ల ఇతర మార్కెట్లలో లోహ లభ్యత తగ్గిందని ఐపీసీపీఏ తెలిపింది.

# ఎన్ఎస్ఈ ఐపీఓ తేదీలొచ్చాయ్.. ధరల శ్రేణి ఇలా..

మదుపర్లు ఆసక్తిగా ఎదురుచూస్తోన్న నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (NSE) పబ్లిక్ ఇష్యూ తేదీలు వచ్చేశాయి. సెప్టెంబరు 17న ఈ ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ ప్రారంభం కానుంది. ఎన్ఎస్ఈ షేరు ధరల (NSE Share Price) శ్రేణిని రూ.1700రూ.1785గా నిర్ణయించారు. ఒక్కో షేరు ముఖ విలువను రూ.1గా పేర్కొన్నారు. ఒక లాట్ పరిమాణంలో ఎనిమిది షేర్లు ఉంటాయి. అంటే.. రిటైల్ ఇన్వెస్టర్లు ఒక లాట్ కోసం రూ.14,280 పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. (NSE IPO Details)

**ఐపీఓ (IPO) తేదీలు ఇలా..**

సబ్‌స్క్రిప్షన్ ప్రారంభ తేదీ : సెప్టెంబరు 17
ముగింపు తేదీ: సెప్టెంబరు 21
షేర్ల కేటాయింపు: సెప్టెంబరు 22
డీమ్యాట్ ఖాతాల్లో షేర్ల క్రెడిట్: సెప్టెంబరు 23
లిస్టింగ్ తేదీ: సెప్టెంబరు 24

షేరు ధర అప్పర్ బ్యాండ్ వద్ద ఎన్ఎస్ఈ ఐపీఓ (NSE IPO) విలువ రూ.22,561.57కోట్లుగా ఉండనుంది. దీంతో దేశంలో రెండో అతిపెద్ద ఐపీఓగా రికార్డు సృష్టించనుంది. మొత్తం షేర్లలో 35శాతం రిటైల్ ఇన్వెస్టర్లకు కేటాయించారు. 50శాతం క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బిడ్డర్లకు రిజర్వ్ చేశారు. మిగతా షేర్లను నాన్‌ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లకు అందుబాటులో ఉంచనున్నారు. అర్హత కలిగిన ఎన్ఎస్ఈ ఉద్యోగులకు షేరుకు రూ.170 చొప్పున డిస్కౌంట్ లభించనుంది. మొత్తం 12.64 కోట్ల ఈక్విటీ షేర్లను పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ రూపంలోనే విక్రయించనున్నారు. వీటిని ఎస్‌బీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా, జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, కెనడా పెన్షన్ ప్లాన్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డ్ వంటి సంస్థల ద్వారా సేల్‌కు పెట్టనున్నారు. ఇందులో ఒక్క ఎస్‌బీఐనే 2.48 కోట్ల



షేర్లను విక్రయించనుంది. గతంలో మొత్తం 14.89 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించాలని ప్రణాళికలు చేసినప్పటికీ.. ఇష్యూ పరిమాణాన్ని 15శాతం మేర కుదించారు. వాస్తవానికి ఈ ఐపీఓ దశాబ్దం క్రితమే రావాల్సి ఉంది. కోలొకేషన్ వివాదం కారణంగా ఇన్నాళ్లూ ఆలస్యమైన ఈ పబ్లిక్ ఇష్యూకు ఇటీవలే సెబీ నుంచి ఆమోదం లభించింది.




# కనిష్ఠాల నుంచి 620 పాయింట్లు కోలుకున్నా నష్టాలు తప్పలే

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాలతో ముగిశాయి. ఉదయం భారీ నష్టాల్లో ప్రారంభమైన సూచీలు.. కనిష్ఠాల వద్ద కొనుగోళ్ల మద్దతుతో కోలుకున్నాయి. ముఖ్యంగా ఐటీ, ఎఫ్ఎంసీజీ, బ్యాంక్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతుతో భారీగా రికవరీ అయ్యాయి. సెన్సెక్స్ దాదాపు 620 పాయింట్లు మేర కోలుకుంది. మళ్లీ ఆఖర్లో స్వల్ప నష్టాల్లోకి జారుకున్నాయి. ఆసియా మార్కెట్‌లు దాదాపు నష్టాల్లోనే ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి ప్రతికూల సంకేతాలతో సెన్సెక్స్ ఉదయం 74,309.16 (క్రితం ముగింపు 74,902.59) వద్ద భారీ నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 74,160.16 వద్ద కనిష్ఠాన్ని తాకింది. కనిష్ఠాల వద్ద కొనుగోళ్ల మద్దతుతో మధ్యాహ్నం తర్వాత సూచీ నష్టాలను భర్తీ చేసింది. చివరికి 120.83 పాయింట్ల నష్టంతో 74,781.76 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 79.70 పాయింట్ల నష్టంతో 23,398 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.57గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా స్టీల్, రిలయన్స్, సన్‌ఫార్మా, బజాజ్ ఫైనాన్స్, ఎన్టీపీసీ షేర్లు నష్టపోయాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎటర్నల్, ఇన్ఫోసిస్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 103 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 4347 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

# సచిన్ రికార్డ్‌కు దగ్గరగా జో రూట్.. వివ్ రిచర్డ్స్ ఆసక్తికర కామెంట్స్

ప్రపంచ క్రికెట్‌లో దిగ్గజ ఆటగాడు సచిన్ తెందుల్కర్ సృష్టించిన రికార్డులు కోకొల్లలు. టెస్టుల్లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా సచిన్ ఇప్పటికీ కొనసాగుతున్నాడు. ఈ రికార్డుకు ఇంగ్లాండ్ కెప్టెన్ జో రూట్ చేరువగా వచ్చాడు. సచిన్ ఖాతాలో 15,921 పరుగులు ఉండగా.. రూట్ ఇప్పటి వరకు 14,208 రన్స్ సాధించాడు. ప్రస్తుతం మంచి ఫామ్‌లోనే ఉన్న అతడు కనీసం రెండేళ్లు ఆడితే చాలు సచిన్‌ను అధిగమించడం పెద్ద కష్టమేం కాదు. ఈ క్రమంలో క్రికెట్ దిగ్గజం వివ్ రిచర్డ్స్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జెఫ్రీ బాయ్‌కాట్



కంటే రూట్ బెటర్ బ్యాటర్‌గా నిరూపించుకున్నట్లేనని సరదాగా కామెంట్ చేశాడు. ''ఇప్పుడు జో రూట్ కెప్టెన్. తప్పకుండా తుది జట్టులో ఉంటాడు. సచిన్ రికార్డును అధిగమించడానికి అనుకూలమైన పరిస్థితుల్లోనే ఉన్నాడు. క్రికెట్ కెరీర్‌లో మైలురాయిగా నిలిచిపోతుంది. అంతేకాకుండా ఇంగ్లాండ్ దిగ్గజం జెఫ్రీ బాయ్‌కాట్‌కూ ఓ సందేశం పంపినట్లు అవుతుంది. యార్క్‌షైర్ నుంచి వచ్చిన అత్యుత్తమ బ్యాటర్ ఇక నుంచి రూట్ అని బాయ్‌కాట్‌కు చెప్పినట్లు అవుతుంది'' అని రిచర్డ్స్ వెల్లడించాడు.

*** మా అబ్బాయికి మంచి రికార్డు ఉంది: మ్యాట్ రూట్**

రూట్ తండ్రి మ్యాట్ రూట్ ఈ రికార్డుపై తన అభిప్రాయం వెల్లడించాడు. ''గతంలో కెప్టెన్‌గా ఉన్నప్పుడు రూట్ ఒక్క ఏడాదిలోనే 1,700 పరుగులు రాబట్టాడు. కెప్టెన్సీ భారం కాదని నిరూపించాడు. ఫిట్‌గా, ఏకాగ్రతతో ఉండి.. ఆడాలనే కోరిక ఉన్నంతకాలం సచిన్ రికార్డును అందుకోవడం పెద్ద కష్టమేం కాదు'' అని మ్యాట్ తెలిపారు.




## ఊపిరి కూడా పీల్చుకోవడం కష్టమైంది..
# నా పని సిక్స్‌లు కొట్టడమే: షఫాలీ

మహిళల ఆసియా కప్‌లో టీమ్‌ఇండియా ఫైనల్‌కు చేరుకుంది. సెమీస్‌లో బంగ్లాదేశ్‌పై హాఫ్ సెంచరీతో షఫాలీ వర్మ అదరగొట్టింది. మిగతా బ్యాటర్లు కాస్త ఇబ్బంది పడిన పిచ్‌పై షఫాలీ మాత్రం భారీ షాట్లను కొట్టగలిగింది. బంగ్లా ఫీల్డర్లు క్యాచ్‌లను వదిలేయడమూ షఫాలీకి కలిసొచ్చింది. అయితే, పవర్ ప్లేలో తన పని భారీ షాట్లు కొట్టడమేనని ఆమె తెలిపింది. ''ఇక్కడి వాతావరణం చాలా ఉక్కపోతగా అనిపించింది. ఒక్కోసారి ఊపిరి పీల్చుకోవడమూ కష్టంగా మారింది. అందుకే, బంతిని ఎదుర్కొని సమయంలో ఒకేసారి ఎక్కువగా గాలిని పీల్చి వదలడం చేస్తుండేదానిని. క్రీజ్‌లోకి వచ్చాక మాత్రం భారీ షాట్లు కొట్టేందుకే ప్రయత్నించా. పవర్ ప్లేలో వీలైనన్ని ఎక్కువ సిక్స్‌లు కొట్టడమే నా పని. మా జట్టు వ్యూహం కూడా అదే. తొలి ఆరు ఓవర్లలో కాస్త ఎక్కువ పరుగులు చేసేందుకు అవకాశం ఉంటుంది. దానిని సద్వినియోగం చేసుకునేందుకు ప్రయత్నించా'' అని షఫాలీ తెలిపింది.

*** ఫీల్డింగ్‌పై మాకెలాంటి ఆందోళన లేదు: దీప్తి శర్మ**

వరుసగా అన్ని మ్యాచుల్లోనూ గెలిచినా.. భారత ఫీల్డింగ్ మాత్రం గొప్పగా లేదు. సెమీస్‌లోనూ బంగ్లా బ్యాటర్లు ఇచ్చిన పలు అవకాశాలను





టీమ్‌ఇండియా ఫీల్డర్లు జారవిడిచారు. దీనిపై దీప్తి శర్మ స్పందిస్తూ.. ''జట్టుగా మేం ఫీల్డింగ్‌పైనా కసరత్తు చేస్తున్నాం. నెట్ సెషన్‌లోనూ ఎక్కువగా క్యాచ్‌లను ప్రాక్టీస్ చేస్తున్నాం. ఒక్కో రోజు ఎంత కష్టపడినా కలిసిరాదు. తప్పకుండా ఫైనల్‌లో గొప్ప ప్రదర్శన ఇచ్చేందుకు ప్రయత్నిస్తాం. తుది పోరులో గెలిచి టైటిల్‌ను సొంతం చేసుకుంటాం. ఫైనల్‌లో ప్రత్యర్థి ఎవరైనా సరే మాకు పట్టింపు లేదు. ఏ జట్టునూ తేలికగా తీసుకోం. శ్రీలంక లేదా పాక్ ఏ టీమ్ వచ్చినా సమష్టిగా రాణించి కప్‌ను అందుకునేందుకు ప్రయత్నిస్తాం'' అని దీప్తి శర్మ వెల్లడించింది.

*** తెలుగమ్మాయి రికార్డు**

తెలుగు మహిళా క్రికెటర్ శ్రీ చరణి అద్భుత రికార్డు సృష్టించింది. భారత్ తరఫున అత్యంత వేగంగా టీ20ల్లో 50 వికెట్లు తీసిన బౌలర్‌గా ఘనత సాధించింది. కేవలం 29 మ్యాచుల్లోనే ఆమె 50 వికెట్ల మైలురాయిని అందుకొంది. ఈ క్రమంలో పురుషుల, మహిళల భారత క్రికెట్‌లో కుల్‌దీప్ యాదవ్‌ను అధిగమించి శ్రీ చరణి ముందుకు దూసుకొచ్చింది. ఇక ఆసియా కప్ సెమీస్‌లోనూ బంగ్లాపై 4 ఓవర్లు వేసిన శ్రీ చరణి 14 పరుగులు ఇచ్చి ఒక వికెట్ పడగొట్టింది.

# సెహ్వాగ్ కంటే గొప్పనా?: ఆయూబ్‌ను ఆడించడంపై నాజర్ హుస్సేన్ విమర్శలు

పాకిస్థాన్ క్రికెట్ టీమ్ తీసుకునే ప్రతి నిర్ణయమూ విమర్శలకు దారితీస్తోంది. పర్యటన మధ్యలోనే ఏడుగురు ఆటగాళ్లను స్వదేశానికి పంపింది. సుదీర్ఘ ఫార్మాట్‌లో ఆడని సైమ్ ఆయూబ్‌ను ఏకంగా తుది జట్టులోకి తీసుకుంది. తీరా, ఆ ఆటగాడు ఘోరమైన ప్రదర్శన చేశాడు. ఇంగ్లాండ్‌తో మూడో టెస్టులో రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ డకౌట్‌గా పెవిలియన్‌కు చేరాడు. దీంతో సైమ్‌తోపాటు పాక్ మేనేజ్‌మెంట్ తీరును ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ నాజర్ హుస్సేన్ విమర్శించాడు. ఈ క్రమంలో టీమ్‌ఇండియా మాజీ ఆటగాడు వీరేంద్ర సెహ్వాగ్‌ను ఉదాహరణగా పేర్కొనడం గమనార్హం. ''సైమ్ ఆయూబ్ చివరిసారిగా 2025 అక్టోబర్‌లో ఫస్ట్‌క్లాస్ మ్యాచ్ ఆడాడు. ఆ తర్వాత సుదీర్ఘ ఫార్మాట్‌లో ఆడిందే లేదు. సీపీఎల్ టీ20 క్రికెట్ బరిలో ఉన్న అతడు.. అక్కడ్నుంచి నేరుగా ఇంగ్లాండ్ గడ్డపై అడుగు పెట్టాడు. విదేశీ పిచ్‌లపై కనీసం అవగాహన లేని కుర్రాడిని ఇలా పంపించాలని ఎవరు నిర్ణయం తీసుకున్నారో అర్థం కావడం లేదు. రాబిన్‌సన్‌తో కూడిన ఇంగ్లాండ్ బౌలింగ్ ఎటాక్‌ను అతడు ఎలా ఎదుర్కొంటాడని భావించారో? ఇలాంటి నిర్ణయాలతో టెస్టు క్రికెట్‌ను అగౌరవపరిచినట్లే. మీరు ఏ క్రికెటర్‌నైనా అడగండి.. టెస్టు ఫార్మాట్ చాలా క్లిష్టమైందనే చెబుతారు. ఇక ఇంగ్లిష్ గడ్డపై టాప్ ఆర్డర్‌లో బ్యాటింగ్ చేయడమంటే అత్యంత కఠినం. కానీ, మీరు మాత్రం ఎక్కడో ఉన్న ఓ ప్లేయర్‌ను తీసుకొచ్చి 'గుడ్ లక్' అని చెప్పి ఇక్కడ వదిలేశారు. కానీ, ఆ కుర్రాడు రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ సున్నాకే పరిమితమయ్యాడు'' అని నాజర్ విమర్శించాడు.

**2011లోనూ..**

భారత్ 2011లో ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లింది. సిరీస్ మధ్యలోనే స్వదేశంలో ఉన్న వీరేంద్ర సెహ్వాగ్‌ను టీమ్‌ఇండియా పిలిపించింది. మూడో టెస్టుకు నేరుగా ఓపెనర్‌గా బరిలోకి




దింపింది. కానీ, సెహ్వాగ్ రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ డకౌట్‌గా పెవిలియన్‌కు చేరాడు. ఇప్పుడు దానిని ఉదహరిస్తూ ఆయూబ్‌పై నాజర్ విమర్శలు చేశాడు. ''ఇదే ఎడ్జ్‌బాస్టన్ మైదానంలో సెహ్వాగ్ కూడా రెండు ఇన్నింగ్స్‌ల్లో పరుగులేమీ చేయలేదు. అతడిని కూడా భారత్ నుంచి అర్ధంతరంగా తెప్పించారు. ఎంతో అనుభవం కలిగిన సెహ్వాగ్ కూడా ఈ పిచ్‌పై ఇబ్బంది పడ్డాడు. అతడి కంటే ఆయూబ్ ఏమైనా గొప్పవాడా?'' అని హుస్సేన్ వ్యాఖ్యానించాడు.

# ద్రవిడ్ మాకు యజమాని.. అలానే ఉంటాడు: విక్రమ్ రాథోడ్

భారత క్రికెట్ దిగ్గజం రాహుల్ ద్రవిడ్ కొత్త పాత్రలోకి ప్రవేశించారు. ఇప్పటి వరకూ ఆటగాడిగా, కోచ్‌గా, మెంటార్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన తొలిసారి ఓనర్‌గా మారారు. యూరోపియన్ టీ20 ప్రిమియర్ లీగ్‌లో డబ్లిన్ గార్డియన్స్‌కు సహ యజమాని అయ్యారు. భారత్‌కే చెందిన విక్రమ్ రాథోడ్ ఈ జట్టుకు కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు. గతంలో ద్రవిడ్ కోచింగ్ బృందంలో భారత జట్టుకు, ఐపీఎల్‌లో విక్రమ్ పనిచేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ద్రవిడ్ యాజమాన్యంలో రాథోడ్ పనిచేయడం గమనార్హం. ఐదు మ్యాచులు ఆడిన



తమ జట్టు ఇప్పటి వరకూ ఒక్క విజయం సాధించలేదని.. అయినా రాహుల్ మద్దతుగా నిలిచారని విక్రమ్ తెలిపాడు. ''అవును రాహుల్ ద్రవిడ్ మాకు యజమాని. ఆయన అలానే వ్యవహరిస్తున్నారు. దానర్థం.. మా పనుల్లో మరీ ఎక్కువగా జోక్యం చేసుకోరు. కోచింగ్ బృందానికి స్వేచ్ఛ ఇచ్చారు. ఇంతకుముందే చెప్పా.. రాహుల్ ద్రవిడ్‌తో పనిచేయడం గొప్ప అనుభవం. కోచ్‌గానూ చేసిన ఆయనకు ఆటపై పూర్తి పట్టు ఉంది. జట్లు ఎలా ఆడతాయి? ఫలితాలు ఎలా వస్తాయి? అనే విషయాలు తెలుసు. టోర్నీ ఆరంభంలో మేం వరుసగా ఓటములను చవిచూశాం. అయినా, ద్రవిడ్ మద్దతుగా నిలిచారు. తన కెరీర్‌లో రాహుల్ అద్భుతంగా రాణించారు. అలాంటి వ్యక్తి నుంచి మనం ఆశించేది కూడా అదే. ఆ విషయంలో మమ్మల్ని ఎప్పుడూ నిరుత్సాహపరచలేదు'' అని రాథోడ్ గుర్తు చేసుకున్నాడు.



## మలయాళ డైరెక్టర్‌తో బన్నీ మూవీ

రెండు సినిమాలు సెట్స్‌పై ఉండగానే మరో మూవీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చాడు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్. కెరీర్‌లో ఫస్ట్ టైమ్ ఓ మలయాళ డైరెక్టర్‌తో సినిమా చేయబోతున్నాడు. హీరో కమ్ డైరెక్టర్ బాసిల్ జోసెఫ్‌తో ఓ సినిమా ఫిక్సైనట్లు సమాచారం. చాలా కాలంగా డిస్కషన్స్ జరుగుతున్నాయట. యూనివర్సల్ పాయింట్ తో బాసిల్ జోసెఫ్ సిద్ధం చేసిన కథ బన్నీకి బాగా నచ్చినట్లు సమాచారం. గత కొన్నేళ్లుగా మాస్, యాక్షన్ ప్రధాన పా-త్రల్లోనే కనిపిస్తున్న అల్లు అర్జున్...బాసిల్ జోసెఫ్ సినిమాలో మాత్రం ఫ్యామిలీ మ్యాన్‌గా నటించనున్నట్లు వార్తలొస్తున్నాయి. స్వీయ నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్ బ్యానర్‌లోనే ఈ సినిమా చేయబోతున్నట్లు టాక్ వినిపిస్తోంది. తెలుగుతో పాటు మలయాళంలో ఒకే సారి ఈ సినిమాను షూట్ చేయబోతున్నట్లు సమాచారం.

## సైఫ్‌పై దీపికా ఫ్యాన్స్ ట్రోల్స్




దీపికా పదుకోణ్ బ్లాక్‌బస్టర్ మూవీపై హీరో సైఫ్ అలీఖాన్ చేసిన కామెంట్లు బాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. తాజాగా హైవాన్ మూవీ ప్రమోషన్లలో అడిగిన ప్రశ్నకు సైఫ్ అలీఖాన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "కాక్ టెయిల్‌లో నటించడమే నా కెరీర్‌లో చేసిన అతిపెద్ద తప్పు. పాతకాలపు ఆలోచనలను ప్రోత్సహించే విధంగా ఉంది. ఇష్టం లే-కపోయినా కొన్ని పరిస్థితుల వల్ల నిర్మాణ బాధ్యతలు చేపట్టాను. ఆ సినిమా చేయడానికి హీరోలు ఎవరూ ముందుకు రాలేదు. ఎలాగైనా సినిమాను పూర్తి చేయాలనే కాక్ టెయిల్‌లో నేనే నటించా. ఇప్పటికీ ఆ సినిమా విషయంలో రిగ్రెట్ గా ఫీలవుతుంటా. కాక్ టెయిల్ తో పాటు హమ్‌షకల్స్ కూడా చేసుండాల్సింది కాదు" అని సైఫ్ అన్నారు. దీంతో అతని కామెంట్లను దీపికా ఫ్యాన్స్ తప్పుపడుతున్నారు. దీపికా వల్లే సినిమా ఆడిందనే నిజాన్ని ఒప్పుకోలేక సైఫ్ ఇలాంటి కామెంట్లు చేస్తున్నాడని అంటున్నారు.


త్రిప్తి డిమ్రి

## మీనా కుమారి బయోపిక్‌లో..

యానిమల్ మూవీతో బాలీవుడ్‌లో పాపులర్ అయ్యింది త్రిప్తి డిమ్రి. గ్లామర్ పాత్రలో తన అందాల ప్రదర్శనతో ఆకట్టుకున్న ఈ సుందరి ఓవర్ నైట్‌లో స్టార్‌గా మారింది. అయితే గ్లామర్ పాత్రలు అంతగా కలిసి రాకపో వడంతో తన రూట్ మార్చింది. కమల్ ఔర్ మీనా పేరుతో తెరకెక్కుతున్న ఓ బయోపిక్ సినిమాను తొలిసారి అంగీకరించింది. అలనాటి బాలీవుడ్ స్టార్ హీరోయిన్ మీనా కుమారి జీవితం ఆధారంగా డైరెక్టర్ సిద్ధార్థ్ పీ మల్హోత్రా ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ఇందులో మీనా కుమారి పాత్రలో త్రిప్తి కనిపించబోతోంది. మీనా కుమారి పాత్ర కోసం తొలుత అలియాభట్, శ్రద్ధాకపూర్, దీపికా పదుకోణ్ పేర్లు విని పించినా చివరకు ఈ అవకాశం త్రిప్తిని వరించింది. ఇటీవలే హీరోయిన్‌గా ఈ బోల్డ్ బ్యూటీని డైరెక్టర్ ఫైనల్ చేసినట్లు సమాచారం.

## పడిపోయిన ప్రియా



ఇటీవల రిలీజై బంపర్ హిట్ అందుకున్న ఇరుముడి సక్సెస్ మీట్ తాజాగా హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా రవితేజ యూనిట్ సభ్యులకు షీల్డ్‌లను అందజేశారు. వాటిని స్వీకరించడానికి స్టేజ్‌పైకి వెళుతున్న సమయంలో హీరోయిన్ ప్రియా భవానీ శంకర్ కిందపడిపోయింది. దీంతో అందరూ కంగారుపడిపోయారు. ఎలాంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరలవుతోంది. డైరెక్టర్ శివ నిర్వాణ ఈ సినిమాను తెరకెక్కించగా సాయికుమార్, బేబీ నక్షత్ర కీలక పాత్రల్లో నటించారు. కేవలం 40 కోట్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ మూవీ ఇప్పటివరకు 250 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టి రికార్డులు సృష్టిస్తోంది.

## రామ్‌తో రొమాన్స్

మలయాళ బ్యూటీ సంయుక్త మీనన్ తెలుగులో మరో క్రేజీ ఛాన్స్ కొట్టేసింది. రామ్ పోతినేనితో రొమాన్స్‌కు రెడీ అయింది. రామ్ స్వీయ దర్శకత్వంలో వస్తున్న ఈ సైకలాజికల్ థ్రిల్లర్ సినిమాలో హీరోయిన్ కన్ఫామ్ అయ్యింది. ఈ విషయాన్ని గురువారం మేకర్స్ అధికారికం-గా ప్రకటించారు. సంయుక్త బర్త్‌డే సందర్భంగా ఆమెకు విషెస్ చెబుతూ ఓ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో సింపుల్ లుక్‌లో సంయుక్త కనిపించింది. ఆమె వెనుక వీ అనే అక్షరం ఉండటం ఆసక్తిని పంచుతోంది. ఈ ఏడాది డిసెంబర్‌లో సినిమాను రిలీజ్ చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. రామ్ తమ్ముడు కృష్ణ పోతినేని నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. కాగా ప్రస్తుతం తెలుగులో ఐదు సినిమాలు చేస్తూ ఫుల్ బిజీగా ఉంది సంయుక్త.



## ఈ వారం ఓటీటీలో రిలీజైన సినిమాలు, వెబ్‌సిరీస్‌లు ఇవే

| | |
|---|---|
| నెట్‌ఫ్లిక్స్ : | విశ్వనాథ్ అండ్ సన్స్ (తెలుగు)<br>చుంబక్ (హిందీ)<br>అన్‌టోల్డ్ రేగన్ (ఇంగ్లీష్)<br>ది టైమ్ ట్రావెలర్స్ వైఫ్ (ఇంగ్లీష్)<br>అనకొండ 3 (ఇంగ్లీష్) |
| అమెజాన్ ప్రైమ్ వీడియో: | మగుడం (తమిళం)<br>మహారాజా హాస్టల్ (మలయాళం)<br>రాక్షసపూరధూల్ (కన్నడ)<br>ది రివాల్యూషనరీస్<br>వెబ్‌సిరీస్ (హిందీ)<br>వన్ నైట్ ఓన్లీ (ఇంగ్లీష్) |
| జీ 5 ఓటీటీ: | వీరభద్రుని రహస్యం వెబ్‌సిరీస్ (తెలుగు)<br>పంచనామా వెబ్‌సిరీస్ (తెలుగు)<br>వరావు (మలయాళం)<br>గమాసాన్ (హిందీ) |
| ఆహా ఓటీటీ: | కట్టాలాన్ (తెలుగు)<br>వెంగెన్స్ (తమిళం) |
| జియో హాట్ స్టార్: | అలీబాబా ఔర్ 40భూత్<br>వెబ్‌సిరీస్ (హిందీ)<br>జంగిల్ టేల్స్ విత్ మోగ్లీ (హిందీ) |
| ఈటీవీ విన్: | బ్లూ స్టార్ (తెలుగు)<br>కొలవెరి (తెలుగు) |